RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక


www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 132 గురువారం, జూన్ 27, 2024 పేజీలు : 4

## ప్రజ్వల్ రేవణ్ణ బెయిల్‌కు ప్రత్యేక కోర్టు నిరాకరణ

బెంగళూరు : లైంగిక దాడుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ, జేడీ(ఎస్) బహిష్కృత నేత ప్రజ్వల్ రేవణ్ణకు చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన బెయిల్ అభ్యర్థనను ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక ప్రజాప్రాతినిధ్య కోర్టు బుధవారం నాడు తోసిపుచ్చింది. హొలెనరసిపుర పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ప్రజ్వల్ ఆయన తండ్రి హెచ్‌డి రేవణ్ణ నిందితులుగా ఉన్నారు. లైంగిక నేరాల కేసులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్ ) కస్టడీలో ప్రస్తుతం ప్రజ్వల్ ఉన్నారు.

## జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమ్రపాలి



హైదరాబాద్: జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఐఏఎస్ ఆఫీసర్ ఆమ్రపాలి బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్‌గా ఆమ్రపాలి బాధ్యతలు స్వీకరించడంతో రొనాల్డ్ రోస్ ఆ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమ్రపాలికి రొనాల్డ్ రోస్‌తో పాటు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఇక ఇంధన శాఖ కార్యదర్శిగా రోనాల్డ్ రోస్ బాధ్యతలు స్వీకరించారు.

## కుప్పంలో అందరూ...

# నా ఆత్మ బంధువులే


### - చంద్రబాబు



**కుప్పం:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పం పర్యటన నిమిత్తం రెండు రోజుల పాటు విస్తృతంగా సమావేశాలు, బహిరంగ సభ, అధికారులతో సమీక్షలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా నిన్న రాత్రి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో కుప్పం నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమావేశంలో సుధీర్ఘంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. కుప్పం ప్రజలతో తనకున్న అనుబంధం గుర్తు చేస్తూ ఎన్ని ఇబ్బందులు వచ్చిన నాపై వారి చల్లని దీవెనలు ఇస్తూ నన్ను అభిమానిస్తున్నారని చంద్రబాబు తెలిపారు. తనను కుప్పం నియోజకవర్గ ప్రజలకు దూరం చేసే చేష్టలను తాను సహించేది లేదని గట్టిగా చెప్పారు. గత ఎన్నికల ఫలితాలు కొంత నిరాశ కల్గించిందని రాష్ట్ర వ్యాప్తంగా కూటమికి వచ్చిన స్పందన కుప్పంలోకి తీసుకు రావడంలో మీరు కొంత వెనుక బడ్డారని తెలిపారు.

కొన్నిచోట్ల ఎవ్వరూ ఊహించని రీతిలో మెజారిటీ రావడం జరిగిందన్నారు. కుప్పం నియోజకవర్గం టీడీపీకి కంచుకోటని మరింత బలోపేతం కావడానికి కొన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కుప్పం నియోజకవర్గం ఉన్న రెండు లక్షల ఇరవై వేల మంది తనకు దగ్గరి బంధువులే అని తెలిపారు. వారిలో కొంతమంది తప్పితే తక్కిన వారందరూ కుప్పం అభివృద్ధి నాతోనే సాధ్యమని భావిస్తున్నారని ఆయన తెలిపారు.

# లోక్‌సభ స్పీకర్‌గా ఓంబిర్లా



ఢిల్లీ: లోక్ సభ స్పీకర్ బిజెపి ఎంపి ఓంబిర్లా ఎన్నికయ్యారు. ఎన్‌డిఎ తరపున ఓంబిర్లా రెండో సారి లోక్ సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఇండియా కూటమి అభ్యర్థిపై ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి గెలుపొందారు. లోక్ సభ స్పీకర్‌పై పదవిపై పాలక పక్షం, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో ఎన్నిక ప్రక్రియను చేపట్టారు. ఎన్‌డిఎ తరుపున ఓం బిర్లా, ఇండియా కూటమి తరపున కె సురేష్ పోటీ చేశారు. ఓంబిర్లా పేరును ప్రతిపాదిస్తూ ప్రధాని నరేంద్రమోడీ తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ తీర్మానాన్ని ఎన్‌డిఎ ఎంపిలు బలపరిచారు. ఇండియా కూటమి తరపున కె సురేష్ పేరును శివసేన ఎంబిటి ఎంపి అరవింద్ సావంత్ తీర్మానం ప్రవేశపెట్టడంతో ఆ కూటమి ఎంపిలు బలపరిచారు. మూజువాణీ ఓటింగ్ చేపట్టడంతో ఓం బిర్లా విజేతగా నిలిచినట్లు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ వెల్లడించారు. ఓం బిర్లాను సభాపతి స్థానం వద్దకు ప్రధాని నరేంద్ర మోడీ, రాహుల్ గాంధీ తీసుకెళ్లి స్పీకర్ సీట్లో కూర్చోబెట్టారు. 2024 లోక్ సభ ఎన్నికలలో రాజస్థాన్‌లోని కోట నుంచి ఆయన ఎంపిగా గెలిచారు. కోట నుంచి ఇప్పటికే ఆయన మూడు సార్లు ఎంపిగా విజయం సాధించారు. మరోసారి స్పీకర్‌గా ఎన్నికైన ఓంబిర్లాకు ప్రధాని నరేంద్ర మోడీ శుభాభినందనలు తెలిపారు. వచ్చే ఐదేళ్లు సభ్యులందరికీ మార్గదర్శనం చేస్తారని విశ్వాసం ఉందన్నారు.

## పఠాన్ కోట్‌లో హైఅలర్ట్.. గ్రామాల్లో ఉగ్రవాదుల సంచారం



న్యూఢిల్లీ : భారత వాయుసేన కీలక స్థావరంగా ఉన్న పఠాన్‌కోట్ జిల్లాలో భారీ ఆయుధాలతో ఇద్దరు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్టు భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో బుధవారం జిల్లాలో హై అలర్ట్ ప్రకటించారు. పలు గ్రామాల్లో దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. బోర్డర్ రేంజి డీఐజీ రాకేశ్ కుశాల్ మాట్లాడుతూ గత రాత్రి అనుమానాస్పద కదలికలను గుర్తించినట్టు పేర్కొన్నారు. దీంతో ఆ ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టినట్టు తెలిపారు. ఇప్పటికే బీఎస్ఎఫ్, సహా అన్ని సెక్యూరిటీ ఏజెన్సీలకు అలర్టులు జారీ చేశామన్నారు. పఠాన్‌కోట్ ఎస్ఎస్‌పీ సుహైల్ ఖాసీం మిర్ ఈ వివరాలను వెల్లడిస్తూ " ఇద్దరు సాయుధులు కోట్ భటియాన్ గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్నట్టు గుర్తించాం. ఈ ప్రాంతం జమ్ముకశ్మీర్ లోని కథువా జిల్లాతో సరిహద్దులు పంచుకుంటోంది. ఈ అనుమానితులే కథువా లోని కోట్ పన్నూలో కూడా సంచరించినట్టు తెలిసింది" అని వెల్లడించారు. ఈనెల 12న పాక్ నుంచి కథువా జిల్లా సుక్‌పాల్ గ్రామం లోకి చొరబడిన ఇద్దరు అనుమానితులను భద్రతా దళాలు కాల్చి చంపాయి.

## కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీలో జాప్యమేల... హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్ : కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఆలస్యం ఎందుకు చేస్తున్నారని రేవంత్ రెడ్డి సర్కార్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం చేసింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పొన్నం ప్రభాకర్ పంచనివ్వడం లేదని. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో అధికారులు చెక్కులు పంపిణీ చేయకుండా ఆపుతున్నారని హైకోర్టులో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 27 వరకు చెక్కులు పంపిణీ చేయకుంటే బౌన్స్ అయ్యే ప్రమాదం ఉందని, త్వరగా పంచడానికి అనుమతులు ఇప్పించాలని కౌశిక్ రెడ్డి కోర్టును అభ్యర్థించారు.

ఈ పిటిషన్ ను విచారించిన కోర్టు చెక్కులను పంపిణీ చేయకుండా ఎందుకు అడ్డుకుంటు న్నారని అధికారులను కోర్టు ప్రశ్నించింది.

# ఆ వెయ్యి కోట్లు ఏమయ్యాయి

### అధికారులను నిలదీసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**అమరావతి : గడిచిన ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ. 1,066 కోట్లు ఏమయ్యాయని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఆయన బుధవారం స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ఉన్నతాధికారులు, ఇంజినీర్లు హాజరయ్యారు. కార్పోరేషన్ పనితీరుపై ఉపముఖ్యమంత్రికి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం, ఆయన స్వచ్ఛాంధ్రకు కేంద్రం నుంచి వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలపై ఆరా తీశారు. అయిదేళ్ళలో కేంద్రం నుంచి వెయ్యి కోట్లకు పైగా వచ్చినట్లు గుర్తించారు. ఈ నిధులు ఎక్కడకు పోయాయని అధికారులను ప్రశ్నించారు. అయితే నాటి ప్రభుత్వంలోని ఆర్థిక శాఖ కేంద్రం నుంచి వచ్చిన నిధులను స్వచ్ఛాంధ్రకు విడుదల చేయలేదని అధికారులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు.**

## జులై 2న రాహుల్ గాంధీ హాజరు కావాలి: యుపి కోర్టు



సుల్తాన్‌పూర్(యుపి): కేంద్ర హొం మంత్రి అమిత్ షాపై అభ్యంతకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపిస్తూ దాఖలు చేసిన పరువునష్టం కేసులో జులై 2వ తేదీన తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఎంపి-ఎమ్మెల్యే కోర్టు బుధవారం ఆదేశించింది. ఈ కేసులో తనను కూడా ప్రతివాదిగా చేర్చుకోవాలంటూ రాంప్రతాప్ అనే వ్యక్తి చేసిన అభ్యర్థనను పిటిషనర్ తరపు న్యాయవాది సంతోష్ కుమార్ పాండే వ్యతిరేకించారు. రాంప్రతాప్ అనే వ్యక్తి బాధితుడిని కాని ఈ కేసుతో సంబంధం ఉన్న వ్యక్తి కాని కాదని పాండే వాదించారు. అయితే పాండే వాదనను రాహుల్ గాంధీ తరపు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా తోసిపుచ్చారు. అయితే ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం రాం ప్రతాప్ అభ్యర్థనను కొట్టివేస్తూ జులై 2న తుదపరి విచారణ రోజున రాహుల్ గాంధీ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ 2018లో రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు దాఖలైంది. బిజెపి నాయకుడు విజయ్ మిశ్రా ఈ కేసు దాఖలు చేశారు.

## కేంద్ర మంత్రి గడ్కరీతో...

# రేవంత్ బృందం భేటి

### రాష్ట్ర ప్రాజెక్ట్‌లపై చర్చ



న్యూఢిల్లీ: కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతి రెడ్డి, కేంద్ర ఉపరితల రవాణా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర రహదారులపై సమావేశం సుదీర్ఘంగా కొనసాగింది. రాష్ట్రంలో జాతీయ రహదారులు, ఫ్లై ఓవర్ల నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్డు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులపై గడ్కరీతో సీఎం బృందం చర్చించింది. ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రోడ్ల అభివృద్ధితోపాటు, అంతర్జాతీయ సంస్థల నుంచి రావాల్సిన నిధుల గురించి చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో ఉన్న రహదారులపై సుధీర్ఘంగా చర్చ జరిగింది. అనంతరం డ్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఈ సమావేశ వివరాలను మీడియాకు తెలిపారు. , తెలంగాణ రాష్ట్రానికి కావాల్సిన రోడ్ల నెట్వర్క్ కావాల్సి అంశాలపై భారత రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి ప్రెజెంటేషన్ ఇచ్చాన్నారు. . రీజనల్ రింగ్ రోడ్డుపై లోతుగా చర్చించామని, దానిపై వెంటనే పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అలాగే, విజయవాడ-హైదరాబాద్ రోడ్డుకు తొందరగా టెండర్లను పిల్చేందుకు సైతం గడ్కరీ అంగీకరించారు అని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్- కల్వకుర్తి రోడ్లతో పాటు ఇతర రోడ్లపై కూడా సుధీర్ఘంగా చర్చ జరిగిందన్నారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కావాల్సిన అన్ని సహాయక సదుపాయాలు కలిపిస్తామని గడ్కరీకి చెప్పామన్నారు.. వారం రోజుల్లో హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో లో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని అంటూ .. అలాగే, తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు చెప్పారు.



# ట్రయల్ కోర్టుకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ వ్యవహారంలో మనీల్యాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ముఖ్యమంత్రి , ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. తాజాగా, ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సిబిఐ అరెస్ట్ చేసింది. ఆయన అరెస్ట్‌కు కోర్టు బుధవా రం అనుమతించడంతో రౌస్ అవెన్యూ కోర్టు లోనే సీబీఐ అదుపు లోకి తీసుకుంది. అనంతరం న్యాయమూర్తి అమితాబ్ రావత్ ఎదుట హాజరు పరిచిన అధికారులు ఐదు రోజుల కస్టడీకి కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో ట్రయల్ కోర్టు గత గురువారం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయగా, దీనిపై ఈడీ హైకోర్టును ఆశ్రయించింది. దిగువ న్యాయస్థానం తమ వాదనలకు తగినంత సమయం ఇవ్వలేదని ఆరోపించింది. దీంతో ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. ఈడీ సమర్పించిన ఆధారాలను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమైందని, బెయిల్ మంజూరులో నిర్ణయం తీసుకునేటప్పుడు సమగ్ర పరిశీలన చేయలేదని ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. అయితే హైకోర్టు నిర్ణయం వెలువడిన తరువాత దీనిపై విచారణ చేపడతామని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు వెలువడడంతో బుధవారం దీనిపై విచారణ చేపట్టింది. అయితే ఈ పిటిషన్‌ను తాజాగా కేజ్రీవాల్ తరపున న్యాయవాదులు వెనక్కు తీసుకున్నారు. పిటిషన్ ఉపసంహరించుకుంటామని కేజ్రీవాల్ కోరగా, అందుకు జస్టిస్ మనోజ్‌మిశ్రా, జస్టిస్ ఎస్వీఎస్ భట్టిల ద్విసభ్య ధర్మాసనం అనుమతించింది. హైకోర్టు పూర్తిస్థాయి ఉత్తర్వులు, సిబిఐ అరెస్ట్ వంటి పరిణామాల నేపథ్యంలో సమగ్ర పిటిషన్ దాఖలు చేస్తామని కేజ్రీవాల్ తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ న్యాయస్థానానికి తెలిపారు. అయితే కేజ్రీవాల్ అరెస్ట్‌కు సీబీఐకి కోర్టు అనుమతివ్వడంపై ఆయన తరపు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం తెలిపారు.

గరుడ వార్త



## సంపాదకీయం

# హెలెన్ కెల్లర్ జీవితం ఆదర్శప్రాయం...

అమెరికాకు చెందిన హెలెన్ కెల్లర్ ప్రఖ్యాత రచయిత, అంగవైకల్య హక్కుల పరిరక్షకురాలు, న్యాయవాది, రాజకీయ కార్యకర్త, పౌర హక్కుల పరిరక్షకురాలు, శ్రామికవర్గ పక్షపాతి, ఉపన్యాసకురాలుగా తనదైన బహుముఖీయ ప్రజ్ఞాశాలి. చిరుప్రాయంలోనే బ్రేయిన్ ఫీవర్ కారణంగా కంటి చూపును కోల్పోయి, చెవిటితనం ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో తన జీవితాన్ని అందరికీ ఆదర్శప్రాయంగా కొనసాగించారు. లక్ష్య సాధనకు అంగవైకల్యం అడ్డుకాదని, తను చీకట్లో నిలిచి ప్రపంచానికి దీపస్తంభంగా మార్గనిర్ధేశనం చేసిన హెలెన్ కెల్లర్ ప్రతిభ అద్వితీయం, అనన్యసామాన్యం, అనుసరణీయం. 27 జూన్ 1880న అమెరికా అలబామాలో కేట్ ఆడమ్స్, కల్నల్ ఆర్థర్ కెల్లర్ దంపతులకు జన్మించిన హెలెన్ కెల్లర్ రెండవ ఏటనే కంటి చూపును, వినికిడిని కోల్పోయారు. తన 7వ ఏట గురువు అన్నే సుల్లివన్ సహాయంతో చదవడం, వ్రాయడం నేర్చుకోవడం ప్రారంభించారు. వినికిడి సమస్యల పట్ల కృషి చేస్తున్న గ్రాహం బెల్, టెలిఫోన్ అవిష్కర్తను కలిసి సూచనలు, సలహాలు పొందారు. 1894లో 'రైట్-హుమాసన్', 'హొరేస్ మన్' బధిరుల పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించారు. 1896లో 'కేంబ్రిడ్జ్ స్కూల్ ఫర్ లేడీస్'లో చేరి విద్యార్జన కొనసాగించారు. 1904లో తన 24వ ఏట హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పొందిన ప్రథమ చెవిటి, కంటి చూపు లేని మహిళగా రికార్డు సాధించారు. తన గురువు అన్నా సుల్లివన్‌ను 1905లో వివాహమాడిన హెలెన్ 1924 - 68 కాలంలో 'అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్' వేదికగా అమెరికాతో పాటు 35 దేశాలు పర్యటించి అంధుల సమస్యల పట్ల బహుళ ప్రచారాలు నిర్వహించారు. ప్రముఖ అమెరికన్ రచయిత్రిగా 14 పుస్తకాలు, వందల కొద్ది ఉపన్యాసాలు, 500లకు పైగా వ్యాసాలు రచించిన హెలెన్ కెల్లర్ జంతుజాలం నుంచి మహాత్మాగాంధీ వరకు అనేక అంశాలను లోతుగా స్పృశించారు. దివ్యాంగుల పక్షపాతిగా కెల్లర్ జీవితాంతం అవిశ్రాంతంగా శ్రమిస్తూనే కార్మిక హక్కులు, మహిళా వికాసం, ప్రపంచ శాంతి విషయాల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేశారు. 'అమెరికన్ సివిల్ లిబర్టీస్'లో సభ్యత్వం తీసుకొని అవిశ్రాంతంగా శ్రమించారు. 1909లో అమెరికా సోషలిస్ట్ పార్టీలో చేరారు. 1903లో తన 22వ ఏటనే ఆత్మకథ 'ది స్టోరీ ఆఫ్ మై లైఫ్' అను పేరుతో రచించి ప్రపంచ దృష్టిని ఆకర్షించగలిగారు. దీనితో పాటుగా 'ఆప్టిమిజమ్', 'ది వరల్డ్ ఐ లివ్ ఇన్', 'మై రిలిజియన్', 'హెలెన్ కెల్లర్స్ జర్నల్', 'ది ఓపెన్ డోర్' లాంటి పలు పుస్తకాలు రచించారు. 27 జూన్ రోజున అమెరికా 'హెలెన్ కెల్లర్ డే'గా పాటించుట జరుగుతున్నది. 1971లో 'అలబామా ఉమెన్ హాల్ ఆఫ్ ఫేమ్'గా ఖ్యాతిని గడించారు. 1964లో నాటి అమెరికా అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్ చేతుల మీదుగా 'ప్రెసిడెన్సియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' అత్యుత్తమ పౌర పురస్కారం పొందారు. కెల్లర్ 87వ ఏట 01 జూన్ 1968న తుది శ్వాస విడిచారు. అతి చిరుప్రాయంలోనే వినికిడి, కంటి చూపు కోల్పోయిన హెలెన్ కెల్లర్ నిరాశ చెందకుండా ప్రజలతో కమ్యునికేట్ చేసుకోగలగడం, చేతి వేళ్ళతో సైగల భాష నేర్చుకోవడం, ఇతరుల పెదవుల కదలికలను (టచ్-లిప్ రీడింగ్) చేతులతో స్పృశిస్తూ అర్థం చేసుకోగలగడం, టైప్ చేయగలగడం, ఫింగర్-స్పెల్లింగ్, బ్రెయిలీ లిపి లోతులు తెలుసుకోగలగడం లాంటి విలక్షణతలతో బంధిరులకు, అంధులకు ఆత్మవిశ్వాసం నింపగలిగారు. చెవిటితనం, అంధత్వంతో బాధ పడే దివ్యాంగుల చికిత్స నిమిత్తం %వి% 2 మిలియన్ల నిధులను 'అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్' సంస్థకు హెలెన్ కెల్లర్ సేకరించగలిగారు. జీవిత చరిత్రను 'ది మిరకిల్ వర్కర్' పేరున చలన చిత్రంగా తీయగా, దానికి 'పులిట్జర్ ప్రైజ్'తో పాటు రెండు అకాడమీ ఆవార్డులు కూడా రావడం జరిగింది. 30 జూన్ 1925న అంతర్జాతీయ లయన్స్ సంస్థ సమావేశంలో మాట్లాడుతూ అంధత్వంతో చీకట్లో మగ్గుతున్న అభాగ్యుల పాలిట చూపును ప్రసాదించే సేవకులుగా అంధత్వ నివారణకు (నైట్స్ ఆఫ్ బ్లైండ్) కృషి చేయాలని లయన్స్ స్వచ్ఛంధ సేవాకార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ పిలుపును సేవా మంత్రంగా భావించిన లయన్స్ అంతర్జాతీయ సంస్థ తమ కార్యాచరణలో అంధత్వ నివారణకు పెద్ద పీట వేస్తూ 'సైట్ ఫస్ట్' పేరుతో నేటికి అంధత్వ నివారణకు అవిరళ కృషి చేయడం జరుగుతున్నది. కెల్లర్ ప్రతిభను గుర్తించిన అమెరికన్ అధ్యక్షులు 'గ్రోవర్ క్లీవ్లాండ్' నుంచి 'లిండన్ జాన్సన్' వరకు అందరూ తమ నివాసం 'వైట్ హౌజ్'కు ప్రత్యేకంగా ఆహ్వానించడం విశేషం. అమెరికన్ ప్రథమ 'గుడ్‌విల్ అంబాసిడర్ టు జపాన్'గా నియమింపబడిన హెలెన్ కెల్లర్ జీవితం దివ్యాంగులకే కాకుండా సాధారణ ప్రపంచ మానవాళికి కూడా ఆదర్శంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. 'సూర్యకిరణాలను చూసే వారికి తమ నీడ కనిపించదు' అనే నినాదంతో తన జీవిత లక్ష్యాలను ఛేదించుటలో వైకల్యం అడ్డురాలేదని రుజువు చేసిన హెలెన్ కెల్లర్ ప్రతిభ అసామాన్యం, తన మానవీయ కోణం అనుసరణీయం.

# ఆ ఐదు హస్తకళలకు గడ్డు రోజులు

**వరంగల్:** 30 ఏళ్ల పాటు విశేష ఆదరణ పొందిన యూరప్ సాంప్రదాయ హస్తకళలు కొన్ని సంవత్సరాలుగా నిరాదరణకు గురవుతున్నాయి. యూరప్ హస్తకళల గురించి ఇక్కడెందుకు ప్రస్తావన అని అనుకుంటున్నారా? అవి నిరాదరణకు గురవుతోంది మన తెలంగాణలోనే. అవును ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ కేంద్రంలో యూరప్ హస్తకళలు గతంలో విశేష ప్రాచుర్యం పొంది వేలమంది జీవనోపాధి కల్పించాయి. కొన్నేళ్ల క్రితం వేల సంఖ్యలో ఇక్కడ కళాకారులకు ఆర్డర్లు ఉండేవి. వారికి అసలు ఖాళీనే ఉండేది కాదు. కానీ ప్రస్తుతం కనీసం వందల సంఖ్యలో ఆర్డర్లున్నా తమ జీవితం వెళ్లిపోతుందని ఆశపడే ధైన్యానికి ఇక్కడి కళాకారులొచ్చారు. రావి ఆకులపై అందమైన పెయింటింగ్స్, తెల్లటి వస్త్రంపై అందమైన కళాకృతులు, చీరలపై మైమరిపించే డిజైన్లు.. ఇవన్నీ యూరోపియన్ హస్తకళలు. ఫాదర్ కొలంబో ఈ యూరోపియన్ హస్తకళలను ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ ప్రాంతానికి పరిచయం చేశారు. ఇక్కడి వారికి నేర్పించి ఈ హస్తకళలకు ఊపిరిపోశారు. 1970 దశకంలో ఫాదర్ కొలంబో స్టేషన్ ఘన్ పూర్ వచ్చి స్థిరపడ్డారు. తనకు తెలిసిన కళను ఇక్కడి వారికి పంచి.. చాలా మంది మహిళలకు, పురుషులకు హస్త కళల్లో నిష్ణాతులను చేసి ఉపాధి అవకాశాలు కల్పించారు. స్టేషన్ ఘన్పూర్ కేంద్రంగా వేలమంది ఈ హస్తకళల్లో ఉపాధి పొందేవారు. అలాంటి హస్తకళలు ఇప్పుడు ఆశించిన మేర ఆదరణకు నోచుకోవడం లేదు.ఫాదర్ కొలంబో యూరోపియన్ దేశాలకు చెందిన నాలుగు కళలు, కేరళకు చెందిన ఒక హస్తకళలను స్టేషన్ ఘన్పూర్ ప్రజలకు పరిచయం చేశారు. రావి ఆకులపై పెయింటింగ్స్, బాబిన్ లేస్, టాటింగ్ లేస్, క్రాస్ స్టిచింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ కళలను నేర్పించి ఉపాధి అవకాశాలు కల్పించారు. సుమారు 4 వేల మంది ఈ హస్తకళలతో ఉపాధి పొందేవారు. ఫాదర్ కొలంబో యూరప్ దేశాల నుంచి ఆర్డర్స్ తీసుకురావడంతోపాటు వీరి చేతిలో రూపుదిద్దుకున్న హస్తకళలను స్పెయిన్, ఇటలీ, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, లండన్ ఇలా తొమ్మిది దేశాలకు ఎగుమతి చేసేవారు. ఇలా సుమారు 30 సంవత్సరాలకు పైగా ఇక్కడి ఈ హస్తకళలకు విశేష ప్రాచుర్యం ఉండేది.2009 లో ఫాదర్ కొలంబో మృతి చెందడంతో ఈ హస్తకళల విక్రయాలకు ఆదరణ కరువైంది. యూరప్ సాంప్రదాయ హస్త కళలు కావడంతో అక్కడ తయారు చేసేవారు లేక ఇక్కడ రూపుదిద్దుకున్న కళాకృతులకు గతంలో అక్కడ విశేష ఆదరణ ఉండేది. అలాంటిది ఫాదర్ మరణం తర్వాత విదేశాలకు ఎగుమతి చేసేవారు లేక హస్తకళలకు ఆదరణ తగ్గిపోయింది. "గతంలో స్టేషన్ ఘన్పూర్ కేంద్రంగా ఒక పరిశ్రమే కొనసాగేది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అనేకమంది కళాకారులు ఇక్కడికి వచ్చి తయారు చేసేవారు. ఇప్పుడు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చాలా మంది కళాకారులు ఈ వృత్తిని వదిలేసి ఇతర ఉపాధి రంగాల్లో కొనసాగుతున్నారు'' అని రావి ఆకు కళాకారుడు ప్రసాద్ చెప్పారు.యూరోపియన్ హస్త కళల్లో ప్రధానంగా ఆకట్టుకునేది రావి ఆకులపై పెయింటింగ్. రావి ఆకులను సేకరించి వాటిని నెలరోజుల పాటు నీటిలో నానబెట్టిన తర్వాత ఆకు పూర్తిగా కుళ్ళిపోయి జాలిలా మారుతుంది. ఆ ఆకులపై 25 రకాల అందమైన పెయింటింగ్స్ ను వేస్తారు. రావి ఆకులపైన వేసిన పెయింటింగ్స్ 50 రూపాయల నుంచి 3 వేల వరకు అందుబాటులో ఉన్నాయి. ఇక బాబిన్ లెస్, టాటింగ్ లేస్ క్రాస్ స్టిచ్చింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ లు 15 వందల రూపాయల నుండి 10 వేల రూపాయల వరకు పలుకుతాయి. ఈ ఐదు హస్తకళలకు ప్రస్తుతం ఆదరణ లేక. ఎలాంటి ఆర్డర్స్ లేక వీటిని నమ్ముకొని ఏళ్లగా ఉపాధి పొందిన కళాకారులు రోడ్డున పడ్డారు. రావిఆకులపై పెయింటింగ్స్ కు గోల్కొండ హస్తకళల సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. మిగతా హస్తకళలకు కూడా తెలంగాణ హ్యాండ్ క్రాఫ్ట్ ద్వారా ఆర్డర్స్ తీసుకువచ్చే ప్రయత్నం తెలంగాణ ప్రభుత్వం చేయాలని యూరోపియన్ హస్తకళల కళాకారులు కోరుతున్నారు.

# నగరంలో బతికేది ఎలా..

**హైదరాబాద్:** హైదరాబాద్ మహా నగరంలో ఇంటి అద్దెలు బాగా పెరిగిపోయాయి. నగరంలోనే కాదు?నగర శివార్లలోనూ ఇదే పరిస్థితి. విద్యాసంస్థలు, ఐటీ కంపెనీలు, ఆస్పత్రులు, ప్రైవేట్ కంపెనీలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లో అద్దె ఇళ్లకు డిమాండ్ బాగా పెరిగింది. ఒక ఏరియాకు ఇది పరిమితం కాలేదు. ప్రతి ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి. దీంతో ఎక్కడ చూసినా అద్దె ఇంటికి డిమాండ్‌తో పాటు రెంట్లు విపరీతంగా పెరిగాయి.కరోనా సమయంలో ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఉండడంతో చాలామంది సొంత ఊళ్ళకు వెళ్లిపోయారు. దీంతో నగరంలో చాలావరకు టూలెట్ బోర్డులు కనిపించేవి. అయితే ఆ తర్వాత ఉద్యోగులు తిరిగి ఆఫీసులకు హాజరవుతున్నారు. దీంతో ఐటీ ఆఫీసులకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఇండిపెండెంట్ హౌస్‌లు హాట్ కేకుల్లా మారాయి.కరోనా తర్వాత ఇంటి అద్దెలు కొన్నిచోట్ల రెట్టింపు అయ్యాయి. గచ్చిబౌలి, కొండాపూర్, మియాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఇంటి అద్దెలు ఆరు నెలల కాలంలో 15 శాతానికి పైగా పెరిగాయి. బేగంపేట్, ప్రకాష్ నగర్,సోమాజిగూడ, పంజాగుట్ట బోయిన్పల్లి,మారేడుపల్లి, అల్వాల్ ప్రాంతాల్లో 20 నుండి 25శాతం అద్దె లు పెరిగాయి. ఎప్పటికప్పుడు పెరుగుతున్న ఇంటి అద్దెలు సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. జీతాలు తప్ప అన్ని పెరుగుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేసే సగటు జీవి?ఈ రెంట్ షాక్ తట్టుకోలేక శివారు ప్రాంతాలకు వెళితే?అక్కడ కూడా అద్దెలు పెంచేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.ఓ అధ్యయనం ప్రకారం కొన్ని ప్రాంతాల్లో ఇంటి రెంట్లు గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మొదటి మూడు నెలల కాలంలోనే పది నుంచి పదిహేను శాతం పైగా పెరిగాయి. గతంలో 10, 15 వేలకు నగరంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అద్దెకు లభించేవి కానీ ఇప్పుడు 20 నుంచి 25 వేల పైగా ఖర్చు చేస్తే దొరకని పరిస్థితి.నగర శివారు ప్రాంతాల్లో సింగిల్ బెడ్ రూం ఇంటి అద్దె ప్రస్తుతం 7 వేల నుంచి 9 వేల రూపాయల వరకు ఉంది. డబుల్ బెడ్ రూం అద్దె 11 వేల నుంచి 15 వేల వరకు ఉంది.




మధ్యతరగతి ప్రజలు, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునేవాళ్లు అద్దెలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు మారుతున్నారు. శివారు ప్రాంతాలైన బోడుప్పల్, పీర్జాదిగూడ, హయత్ నగర్, ఎల్బీనగర్, నిజాంపేట్, బండ్లగూడ జాగీర్ తదితర ప్రాంతాల్లో అద్దె ఇళ్ళకి డిమాండ్ పెరిగింది.శివారు ప్రాంతాల నుంచి ఐటీ ఆఫీసులకు వెళ్లడం కష్టమని భావించిన కొందరు సాఫ్ట్ వేర్ ఉద్యోగులు విదేశాల్లో మాదిరిగా డబుల్ , ట్రిపుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లను పంచుకుంటున్నారు. ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలతో ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరికొందరు పేయింగ్ గెస్ట్‌లుగా ఉంటూ అద్దె భారాన్ని తప్పించుకుంటున్నారు. అద్దె ఇళ్లకు డిమాండ్ పెరగడంతో యజమానులు ఏటా అద్దెలు పెంచుతున్నారు. భవిష్యత్తులో ఔటర్ రింగ్ వెలుపల కూడా అద్దెకు ఇళ్లు దొరకడం కష్టంగా మారే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# కారుకు మబ్బులు కమ్ముకున్నాయా

**నిజామాబాద్:** తెలంగాణ రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ ఖాళీ అయ్యేలా కనిపిస్తోంది. రోజురోజుకి కారు దిగుతున్న ఎమ్మెల్యేల సంఖ్య పెరుగుతోంది. ముందు ముందు ఈ పరిస్థితి మరింత తీవ్రమయ్యేలా ఉంది. కారు పార్టీపై కారు మబ్బులు కమ్మేస్తున్నా.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌లో చలనం లేదు. అసలు కేసీఆర్ ఎక్కడున్నారని పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. మూడు రోజుల క్రితం మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ షాక్ నుంచి తేరుకునే లోపే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కూడా కారు దిగి హస్తం కండువా కప్పుకున్నారు.కేసీఆర్ కు సంజయ్ అత్యంత సన్నిహితుడని చెప్పుకుంటారు. మరి అలాంటి వ్యక్తే పార్టీ వీడితే.. మిగిలిన వారి పరిస్థితి ఏంటనే ప్రశ్నలు తలెత్తున్నాయి. ఆ ప్రశ్నలకు తగ్గట్టుగానే గ్రేటర్ పరిధిలో మరో ఆరుగుగు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. దీనికి ముహూర్తం కూడా ఫిక్స్ చేసుకున్నారని బీఆర్ఎస్ వర్గాలే చెబుతున్నాయి. జులైలో జరిగే అసెంబ్లీ సమావేశాల నాటికి కేసీఆర్ కు ప్రతిపక్ష హోదా కూడా ఉండదనే భయం ఆ పార్టీ వర్గాల్లో మొదలైంది. కేసీఆర్ ను చుట్టూ ముడుతున్నాయి.లిక్కర్ కేసులో కుమార్తె జైలుకు వెళ్లింది. సుమారు 100 రోజులు దాటుతున్నా.. ఆ విషయంలో కేసీఆర్ ఇంత వరకూ స్పందించలేదు. పార్టీ కష్టాల్లో ఉన్నపుడు కేడర్ కు అందుబాటులో ఉంటున్నారా అంటే అదీ లేదు. పార్టీని నమ్ముకున్న వాళ్లకు ధైర్యాన్ని ఇవ్వకపోతే వారంతా పక్క చూపులు చూసే ప్రమాదం ఉంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు వెళ్లిపోతే పెద్ద ప్రమాదం ఉండదు. కానీ, క్షేత్రస్థాయి నేతలు వేరే గూటికి చేరితే.. మళ్లీ పార్టీని నిర్మాణం చేయడం చాలా కష్టం. అసలే లోకల్ బాడీ ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. ఈ టైంలో కేసీఆర్ అలర్ట్ అవ్వకపోతే గ్రామ స్థాయి కేడర్ మొత్తం కాంగ్రెస్ లేదా బీజేపీ గూటికి చేరడం ఖాయంగా తెలుస్తోంది. అదే జరిగితే బీఆర్ఎస్ ఇక చరిత్రలో కలిసిపోయినట్టే.బీఆర్ఎస్ ఎల్పీ కాంగ్రెస్ లో విలీనం అవుతుందని.. బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం అవుతుందని.. రోజుకో ప్రచారం జరుగుతున్నా కేసీఆర్ స్పందించడం లేదు. ప్రమాదం అంచున ఉన్నపుడు మౌనంగా ఉండటం వ్యూహమని కేసీఆర్ భావిస్తున్నారేమో కానీ.. అదే రేపు ప్రమాదంగా మారి పార్టీకి ఉనికి లేకుండా చేస్తుంది. అధికారంలో ఉన్నపుడు పార్టీ శ్రేణులకు అందుబాటులో లేకపోయినా.. పదవులు, నిధులు అందుతూ ఉంటాయి కాబట్టి పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ, అధికారం కోల్పోయినపుడు కుటుంబ పెద్దగా వారికి ధైర్యం చెప్పాల్సిన బాధ్యత కేసీఆర్ పై ఉంది. కానీ, వరుస ఓటముల తర్వాత ఆయన బయటకు రావడానికే ఇష్టపడటం లేదు.మధ్యలో ఓసారి పార్లమెంట్ ఎన్నికల టైంలో ప్రజల్లోకి వచ్చినా ఫలితం శూన్యమైంది. ఎన్నికల టైంలో వస్తానంటే పరిస్థితి ఇలాగే ఉంటుందని కేసీఆర్ అర్థం చేసుకొని నిత్యం ప్రజల్లో ఉండటానికి ప్రయత్నించాలి. కేసీఆర్ కు ప్రతిపక్షం కొత్తేం కాదు.. పోరాటాలు కొత్తకాదు. కానీ, ఓ సారి అధికారానికి అలవాటు పడి ఓడిపోవడం మాత్రం తెలుగు రాష్ట్రాల మాజీ సీఎంలు కేసీఆర్, జగన్ కు కొత్తే. అందుకే ఆ ఓటములను అంగీకరించలేకపోతున్నారు. కానీ.. గెలుపు, ఓటములను ఒకేలా తీసుకోవాలి.చంద్రబాబు అలా తీసుకొని వెంటనే ప్రజల్లోకి వెళ్తారు. తప్పులను సరిదిద్దుకుంటారు. రాజకీయాల్లో ఆయన పేరు మసకబారదు. కార్యకర్తలు చనిపోతే స్వయంగా ఆయనే శవపేటిక మోస్తారు. పార్టీలో ఆయన కూడా ఓ సామాన్య కార్యకర్తలా ఉంటారు. అందుకే.. ఓటమి తర్వాత గెలుపును చంద్రబాబు చూస్తూ ఉంటారు. జగన్, కేసీఆర్ కూడా చంద్రబాబు నుంచి ఈ విషయాన్ని నేర్చుకోవాలి. అలా అయితేనే ఆయా పార్టీలు నిలబడతాయి.



ఇటీవల కారు ప్రమాదం లో మరణించిన శామీర్ పెట్ మండలం లాల్ గడి మలక్ పెట్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు ఎల్లం గారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రివర్యులు మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి గారు ఆర్థిక సహాయం చేసి అలాగే వారి కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారం అందిస్తానని అభయం ఇవ్వడం జరిగింది.

# చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

### - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ

**పెద్దపల్లి ప్రతినిధి:** మాదక ద్రవ్యాలతో సహా ఇతర చెడు అలవాట్లకు పూర్తి స్థాయిలో దూరంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ అన్నారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భం గా ఏర్పాటు చేసిన మిషన్ పరివర్తన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వల్ల మన ఆరోగ్యం పాడవడంతో పాటు చట్టప్రకారం శిక్షార్హులమవుతామని అన్నారు. గంజాయి, డ్రగ్స్, మొదలగు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి చిన్నతనం నుంచి పిల్లలకు అవగాహన కల్పించాలని అన్నారు. చిన్న వయస్సులో పిల్లలు, యువకులు కొత్త అలవాటు ట్రై చేద్దాం అనే ఉద్దేశంతో మాదక ద్రవ్యాల వినియోగం ప్రారంభిస్తారని, ఒకసారి మాదకద్రవ్యాలు అలవాటైతే దానికి బానిసలుగా మారుతారని అదనపు కలెక్టర్ తెలిపారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను పోషించాలని, మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్న వారి సమాచారం అందించా లని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలోని విద్యా సంస్థల్లో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది విద్యార్థులను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. విద్యార్థుల ప్రవర్తనను గమనించి ఏదైనా తేడా అనిపిస్తే వెంటనే అవసరమైన కౌన్సిలింగ్ ఇవ్వాలని, మాదకద్రవ్యాల అంశం చాలా కీలకమైన అంశమని ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థుల జీవితాలను నాశనం చేసే అవకాశం డ్రగ్స్ కు ఉందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి జూనియర్, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలో డ్రగ్స్, గంజాయి మొదలగు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను, చట్ట ప్రకారం పడే శిక్షలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వినియోగం వల్ల లివర్, కిడ్నీ, నరాల వ్యవస్థ పూర్తిగా దెబ్బ తింటుందని, డ్రగ్స్ కు అలవాటు పడిన వారు అధికంగా నిరాశ నిస్పృహలకు లోనుకావడం, ఆత్మహత్య ఆలోచనలు రావడం, అసాధారణమైన ప్రవర్తన కలిగి ఉండటం జరుగుతుందని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారికి చికిత్స అందించేందుకు రామగుండం జనరల్ ఆసుపత్రిలో డీ అడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేశామని, పెద్దపల్లి ఆసుపత్రిలో సైతం అవసరమైన వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞను అదనపు కలెక్టర్ చేయించి, మాదక ద్రవ్యాలకు నో చెప్పండి అనే పోస్టర్ ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించా రు. అంతకు ముందు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ పాడిన పాటలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆర్. మహిపాల్ రెడ్డి, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఏ.సురేష్, పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ సంబంధిత అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంవీవీకి హైకోర్టులో షాక్

విశాఖపట్టణం: విశాఖపట్నం మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. హయగ్రీవ సంస్థకు చెందిన భూముల వ్యవహారంలో విశాఖపట్నం ఆరిలోవ పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసు విషయంలో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు హైకోర్టు షాక్ ఇచ్చింది. ఈ కేసు విషయంలో హైకోర్టును ఎంవివి సత్యనారాయణ ఆశ్రయించారు. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు కేసు ఎఫ్ఐఆర్ దశలో ఉన్నందున అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని హైకోర్టు సూచించింది. పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ప్రతివాదులైన పోలీసులు, ఫిర్యాదుదారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే శ్రీనివాసరెడ్డి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంవోయూ పేరిట ఖాళీ పత్రాలపై సంతకాలు తీసుకుని విశాఖ జిల్లా ఎండాడ గ్రామంలోని తమ విలువైన భూములు కాజేసేందుకు ప్రయత్నించారంటూ హయగ్రీవ ఇన్ ఫ్రాటెక్ కు చెందిన సిహెచ్ జగదీశ్వరుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆరిలోవ పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో తనపై నమోదైన కేసులు కొట్టేయాలంటూ మాజీ ఎంపీ ఎంవీవి సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం జరిగిన విచారణలో పిటిషన్ తరపు సీనియర్ న్యాయవాది వైవి రవి ప్రసాద్ వాదనలు వినిపించారు. సివిల్ వివాదాన్ని క్రిమినల్ కేసుగా మార్చడానికి వీల్లేదు అంటూ వాదించారు. అరెస్టు నుంచి పిటిషనర్ కు రక్షణ కల్పించాలని కోరారు. ఈ వాదనను తోసిపుచ్చిని న్యాయమూర్తి ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. నగరంలోని హయగ్రీవ ప్రాజెక్టు గత కొన్నాళ్ళుగా వార్తల్లో నిలుస్తూ వస్తోంది.

## టాస్క్ ఫోర్సు కార్యాలయాన్ని సందర్శించిన తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

**తిరుపతి:** టాస్క్ ఫోర్సు కార్యాలయానికి తిరుపతి ఎస్పీ, టాస్క్ ఫోర్స్ ఇన్చార్జిగా ఇటీవల చార్జి తీసుకున్న వీ.హర్షవర్ధన్ రాజు బుధవారం సందర్శించారు. ఆయనకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి కార్యాలయంలో ఆయన అధికారులతో మాట్లాడారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అడవుల్లో చేపడుతున్న కూంబింగ్, సమాచార వ్యవస్థ గురించి ఎస్పీ శ్రీనివాస్ ఆయనకు వివరించారు. ఇంకా టాస్క్ ఫోర్సులో అటవీ అధికారుల పనితీరు గురించి తెలుసుకున్నారు. కూంబింగ్ ఆపరేషన్ల పనితీరు గురించి అధికారులు వివరించగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. దాదాపు గంట పాటు ఆయన టాస్క్ ఫోర్సు అధికారులతో సమావేశమయ్యారు. తరువాత ఆయన మాట్లాడుతూ టీమ్ లు ఆపరేషన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొవాలని తెలిపారు. ఎర్రచందనం స్మగ్లింగ్ జరగకుండా ఉండేలా స్మగ్లర్లను నిరోధించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫీల్డ్ ఆపరేషన్లలో అటవీ శాఖా సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. స్మగ్లర్లను పట్టుకునేందుకు వీలుగా ఆపరేషన్లు చేపట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో తిరుపతి కార్యాలయంతో పాటు, కడప, రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఇంకా టాస్క్ ఫోర్సు డీఎస్పీ చెంచుబాబు, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐలు సురేష్ కుమార్ రెడ్డి, కృపానంద, చిరంజీవులు పాల్గొన్నారు.

====================

## ఏపి కాంగ్రెస్ లో ముదురుతున్న వార్

**విజయవాడ:** ఏపీ కాంగ్రెస్ లో వార్ ముదురుతోంది. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ సుంకర పద్మ శ్రీ, రాకేష్ రెడ్డిలకు క్రమశిక్షణ కమిటీ నోటిసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. షర్మిలా, మాణిక్యం ఠాకూర్ అవినీతికి పాల్పాడారని పద్మశ్రీ, రాకేష్ రెడ్డి ఆరోపణలు చేసారు. వాళ్ళు చేసిన ఆరోపణలపై 7రోజుల్లో వివరణ ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. చివరకు నోటిసులకు పద్మశ్రీ, రాకేష్ రెడ్డి సమాధానం ఇచ్చారు. 20వ తేదీన అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు షర్మిళ ప్రకటించారని రీప్లే లో పద్మ శ్రీ, రాకేష్ రెడ్డి పేర్కోన్నారు. అన్ని కమిటీలు రద్దు చేసినప్పుడు క్రమ శిక్షణ కమిటీ కూడా రద్దు అవుతుందని పేర్కోన్నారు. నోటీసులో పేర్కొన్న విధంగా వివరణ ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్న ఎవరికి ఇవ్వాలో అయోమయంలో ఉన్నామని పేర్కొన్నారు. తాను అడిగిన ప్రశ్నలకు ముందు సమాధానాలు ఇవ్వాలని కోరారు.

======================

## టీడీపీ నేత భార్య దారుణ హత్య

**నంద్యాల:** ఆళ్లగడ్డలో టీడీపీ నేత అట్ల భాస్కర్ రెడ్డి భార్య శ్రీదేవి హత్య గుర్తు తెలియని దుండగులు హ త్య చేశారు. కళ్లల్లో కారం చల్లి మరీ బండరాళ్లతో మో ది చంపారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎమ్మెల్యే అఖిల ప్రియ కు శ్రీదేవి సన్నిహితురాలు. తాజాగా జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం అఖిల ప్రియకు మద్ద తుగా భార్యభర్తలు ప్రచారం చేశారు. పలు కార్యక్రమంలో పాల్గొని అఖిలప్రి యకు ఆమె తోడుగా నిలిచారు. శ్రీదేవి హత్యతో ఆళ్లగడ్డలో టెన్షన్ వాతావర ణం నెలకొంది. అల్లర్లు చెలరేగే అవకా శం ఉండడంతో పోలీసులు భారీగా మోహరిస్తున్నారు. రాజకీయ కక్షల నేపథ్యంలో హత్య జరిగిందా లేక మరే దైనా కారణమా తెలియాల్సి ఉంది.

======================

## కొత్త కలెక్టర్ గా వెట్రిసెల్వి

**ఏలూరు:** ఏలూరు జిల్లా కలెక్టర్ గా నియమితులైన కె. వెట్రిసెల్వి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మొదట ప్రకాశం జిల్లాలో శిక్షణా కలెక్టర్ గా పనిచేశారు. 2016 నుంచి ఏడాదిన్నరపాటు మదనపల్లి సబ్ కలెక్టర్ గా పనిచేస్తునే కుప్పం నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిణిగా అధనపు బాధ్యతలు నిర్వహించారు. నెల్లూరు జాయింట్ కలెక్టర్ గాను, సమగ్ర శిక్షా ఎస్ పిడిగా పనిచేశారు. 2024 ఫిబ్రవరి నుంచి స్త్రీ శిశు సంక్షేమ శాఖలో డైరెక్టర్ గా ఉన్నారు. తాజా బదిలీల్లో ఏలూరు జిల్లా కలెక్టర్ గా నియమితులయ్యారు. కలెక్టర్ వెట్రిసెల్వి బుధవారం ఉదయం జిల్లాకు చేరుకుంటారు. కలెక్టరేట్ లో ఉదయం9.30 గంటలకు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు. దేశంలోని అతిపెద్ద రెవిన్యూ డివిజన్ గా గుర్తింపు పొందిన మదనపల్లి సబ్ కలెక్టర్ గా తనదైన శైలిలో రాణించారు. చిన్నవయస్సులోనే 2014లో ఐఎఎస్ లో 143 వ ర్యాంకును సాధించిన వెట్రిసెల్వి కుప్పం స్పెషల్ ఆఫీసర్ గా ప్రతిభ చూపారు. నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ గా పదోన్నతి పొందారు. భూ సమస్యలన్నింటిని పరిష్కరించి తనదైన శైలి చూపించారు.

======================

## నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన డివైఎఫ్ఐ

**గోదావరిఖని:** నీట్ ప్రవేశ పరీక్షల్లో జరిగిన అవకతవకలపైన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిర్లక్ష్యన్ని వీడి బాధ్యులపైన కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్ టి ఏ సంస్థను వెంటనే రద్దు చేయాలని డివైఎఫ్ఐ. ఎన్ ఎస్ యు ఐ.ఎ శ్రేణులు బుధవారం గోదావరిఖని చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసారు.

ఈ సందర్భంగా బి వై ఎఫ్ ఐ.జిల్లా అధ్యక్షులు సాగర్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి దుర్గ మాట్లాడుతూ విద్యార్థి యువజన సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చౌరస్తాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా కూడా ఎంతో మంది విద్యార్థులు వైద్య వృత్తి ద్వారా సమాజంలో సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో రాత్రి పగలు తేడా లేకుండా ఎంతో కష్టపడి వేల రూపాయలు ఖర్చుపెట్టి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకొని నీట్ ఎగ్జామ్ పరీక్ష రాయగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సంస్థ నిర్లక్ష్యం కారణంగా లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఈరోజు ప్రశ్నార్థకంగా మారిందని వారు మండిపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున నీట్ పరీక్షలో జరిగిన అవగతవకల పైన సమగ్ర విచారణ సిట్టింగ్ జడ్జితో జరిపించాలని దోషులను కఠినంగా శిక్షించి తిరిగి పరీక్ష నిర్వహించాలని గత కొన్ని రోజులుగా విద్యార్థి యువజన లోకం గొంతెత్తి ప్రశ్నిస్తూ ఉంటే ప్రధాని మోడీ దున్నపోతు మీద వర్షం పడ్డ మాదిరిగా పట్టనట్టు వ్యవహరించడం దుర్మార్గమని వారు అన్నారు.

# నౌకాదళ అసమాన సేవలు!

భారత నావికాదళం దేశం యొక్క సముద్ర సరిహద్దులను భద్ర పరచుటలో, ఓడరేవు సందర్శనల ద్వారా, భారతదేశం అంతర్జాతీయ సంబంధాలను విస్తరించుటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. భారతదేశ నావికా దళం భారత సైనిక దళాల యొక్క సముద్ర విభాగం. భారతదేశ రాష్ట్రపతి నౌకాదళానికి సర్వ సైన్యాధ్యక్షుడు. కేవలం దేశ రక్షణకే కాకుండా మానవతా సహాయాలకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు సహాయం కొరకు భారత ప్రభుత్వం నేవీని వినియోగిస్తుంది. ఉమ్మడి వ్యాయామాలు, మానవతావాద మిషన్లు, విపత్తు ఉపశమనం మొదలైనవి వారి కర్తవ్యాలు. భారత దేశంలో క్రీ. పూ. 2300లో ప్రస్తుత గుజరాత్ లోని మంగ్రోల్ దగ్గర మొట్టమొదటి నౌకాతీరం నిర్మించ బడినది. క్రీ.పూ. 4వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్యంలో మొదటిసారి నౌకా విభాగాన్ని ఏర్పరిచారు. చంద్రగుప్త మౌర్యుడి ప్రధాన మంత్రి అయిన చాణక్యుడు తాను రచించిన అర్ధ శాస్త్రంలో నవాధ్యక్ష పేరుతో నదీ జలాల వినియోగం గురించి నిర్దేశించాడు. బ్రిటీషు ప్రభుత్వం భారత దేశాన్ని పాలిస్తున్నప్పుడు 1830లో రాయల్ ఇండియన్ నేవిని ఏర్పరిచారు. ఇది 1946 నాటికి 78 ఓడలు, 2000 మంది సిబ్బంది కలిగి ఉండేది. 26 జనవరి 1950 న భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చిన రోజున నౌకా దళానికి ఇండియన్ నేవిగా, వాహకాలకు ఇండియన్ నావల్ షిప్ గా పేరు పెట్టారు. 1961లో జరిగిన ఆపరేషన్ విజయ్ లో ఇండియన్ నేవి మొట్ట మొదటి సారి యుద్ధంలో పాల్గొన్నది. 1965లో జరిగిన భారత్ – పాక్ యుద్ధంలో నేవి ఎక్కువ పాల్గొనక పోయిన తీర ప్రాంతాల పరిరక్షణలో కీలకపాత్ర వహించింది. 1971లో జరిగిన భారత్ – పాక్ యుద్ధంలో నేవి విశిష్టమైన పాత్ర పోషించింది. ఈ యుద్ధంలో పాకిస్తాన్ దగ్గర ఉన్న అత్యంత ప్రమాదకరమైన పి ఎన్ ఎస్ ఘాజి జలాంతర్గామిని ధ్వసం చేసి సముద్రంలో ముంచి వేసిన ఘనత ఐ ఎన్ ఎస్ – రాజ్ పుత్ కు దక్కుతుంది. ఐ ఎన్ ఎస్ నిర్ఘాట్, ఐ ఎన్ ఎస్ నిపత్ లు కరాచీ పోరను చుట్టిముట్టి మిగిలిన పాకిస్తాన్ పోర్టులతో రాకపోకలను, పాక్ సైన్యానికి సహాయాన్ని అడ్డుకొని భారత దేశానికి విజయాన్ని అందించడంలో ముఖ్యపాత్ర వహించాయి. 2004లో దక్షిణ భారత దేశాన సునామి సంభవించి నపుడు కొద్ది గంటల్లోనే నేవి 27 నౌకలు, 19 హెలీకాప్టర్లు, 06 యుద్ధ విమానా నౌకలు, 5000 మంది సిబ్బందితో ముందుగా సహాయ చర్యలు చేపట్టింది. నేవి చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున సహాయ చర్యలు చేపట్టడం ఇదే ప్రథమం. ఆధునిక భారతీయ నౌకాదళం హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన స్థానాన్ని మెరుగు పరిచేందుకు వేగవంతమైన పునర్నిర్మాణంలో భాగంగా ఉంది. ఈ నివేదిక ప్రకారం 58,000 మంది సిబ్బంది, విమాన వాహక నౌక, పెద్ద రవాణా ఓడ, 15 యుద్ధ నౌకలు, 8 గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్లు, 24 కొర్వెట్టెలు, 13 సంప్రదాయ జలాంతర్గాములు, 1 అణు దాడి జలాంతర్గామి, 30 పెట్రోల్ ఓడలు, వివిధ సహాయక నౌకలు మొదలైనవి భారత నావికా దళంలో భాగం. భారత నావికా దళంలో తూర్పు కమాండ్ – విశాఖపట్నం, పశ్చిమ కమాండ్ – ముంబాయి దక్షిణ కమాండ్ – కోచి, అండమాన్ నికోబార్ నావల్ – పోర్ట్ బ్లెయిర్ అనే 4 కమాండ్ లు ఉన్నాయి. 1985 నుండి అణు జలాంత ర్గాములను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలసి నేవి కృషి చేస్తోంది. 1987లో భారత నౌకా దళంలో జలాంతర్గాముల విభాగాన్ని ఏర్పాటు చేశారు. జలాంత ర్గాముల నుండి టర్పీడో అను క్షిపణులను ప్రయోగిస్తారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్ట మొదటి సబ్ మెరైన్ – ఐ ఎన్ ఎస్ షల్కి. 8 డిసెంబర్ 1967లో భారత నౌకా దళంలో ప్రవేశ పెట్టబడిన తొలి జలాంతర్గామి – ఐ ఎన్ ఎస్ కల్వరి. జలయుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు, భారత నావికా దళానికి ఎంతగానో ఉ పకరిస్తుందని భావిస్తున్న ఎలక్ట్రానిక్ టోర్పెడో 'వారుణాస్త్ర' స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ అభివృద్ధి చేసిన జలాంతర్గామి విధ్వంసక టార్పెడో. భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థకు చెందిన నేవల్ సైన్స్ అండ్ టెక్నొలాజికల్ లేబొరేటరీ ఈ హెవీవెయిట్ టార్పెడోను అభివృద్ధి చేసింది. సముద్ర గర్భంలో... శత్రు దేశపు సబ్ మెరైన్ ధ్వంసం చేసే టార్పెడో ఇది. ఓడనుండి ప్రయోగించే రకపు వారుణాస్త్రను 2016 జూన్ 26న న భారత నౌకాదళంలో చేర్చుకున్నారు. యుద్ధ నౌక నుంచే ఈ హెవీ వెయిట్ టార్పెడోను సముద్రంలో దాగి ఉన్న శత్రు దేశపు జలాంతర్గామిపై ప్రయోగించవచ్చు. 95 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైంది. ప్రపంచంలో జీపీఎస్ ఆధారంగా దూసుకుపోయే ఏకైక టార్పెడోగా వారుణాస్త్ర వినుతికెక్కింది. ఐ ఎన్ ఎస్ కల్వరి – 14 డిసెంబర్ 2017న, ఖండేరి సెప్టెంబర్ 2019న, కరంజ్ మార్చి 2021న, వేలా నవంబర్ 2021న, వాగిర్– నవంబర్ 2020లో ప్రారంభించ బడింది. 2023 జనవరి 23న వగీర్ జల ప్రవేశం చేయడంతో, భారత నౌకాదళంలో చేరి, భారతదేశం జలాంతర్గామి నిర్మాణ దేశంగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. వగీర్ అంటే ఇసుక సొరచేప. ఐఎన్ఎస్ వగీర్లో ప్రపంచంలోని అత్యుత్తమ సెన్సార్లు ఉన్నాయి.

# మారకద్రవ్యాల అడ్డుకట్ట ఎలా?



ప్రపంచాన్ని మాదక ద్రవ్యాల ముక్తం చేయాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు సహకారాన్ని, చర్యలను బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది 26 జూన్న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ డిసెంబర్ 7, 1987న చేసిన తీర్మానం 42/112 ద్వారా ప్రతి సంవత్సరం జూన్ 26వ తేదీని అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవంగా జరపాలని నిర్ణయించింది. ఈ తీర్మానం 1987 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డ్రగ్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ నివేదిక ఇతర అంశాల పై మరికొన్ని చర్యల కోసం సిఫార్సు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ది యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యూఎన్ఓడిసి) ఈ రోజున మత్తు పదార్థాల వల్ల ఏర్పడే సమస్యల పట్ల చైతన్యం కోసం అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టింది.

ప్రతి ఏటా జూన్26న ప్రపంచ వ్యాప్తంగా మాదక ద్రవ్యాలను స్వాధీన పర్చుకుని దేశ దేశాల్లో బహిరంగంగా వాటిని తగులబెట్టడం, బహిరంగ సభలు, ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడం వంటి చర్యలను పెద్ద ఎత్తున ఐరాస ప్రోత్సహిస్తోంది.

మాదకద్రవ్యాలు మానసికస్థితిపై ప్రభావం చూపడమే కాకుండా శరీరంలోని అన్ని అవయవాలను అస్తవ్యస్తం చేస్తాయి. వాటికి బానిసలై ఒక్కసారిగా దూరమైన వారి ప్రవర్తన చాలా భిన్నంగా ఉంటుంది. వీటికి అలవాటు పడి ప్రాణాలు కోల్పోతున్న వారెందరో. ఇంతకుముందు ఇరవై అయిదేళ్ల వయస్సులో వ్యసనాలకు లోనైన వారు ఇప్పుడు పదహారేళ్లకే ఈ పదార్థాలను వాడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. మత్తు పదార్థాల వాడకం వల్ల మెదడులో కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. వాటిని ఎండార్ఫిన్స్ అంటారు. 'మత్తు' ఉంటేనే ఎండార్ఫిన్స్ విడుదలవుతాయి. అవి దొరకని సమయంలో వారు నీరసంగా కనిపిస్తారు. కుటుంబ విలువలు విచ్ఛిన్నం కావడం, కుతూహలం, పిచ్చెక్కిస్తున్న పోటీ, భావోద్వేగ సమస్యలు, నిత్య జీవిత సమస్యల ఒత్తిడులు, చేతిలో డబ్బు బాగా ఆడడం యువకులలో, పెద్దలలో, వృత్తి నిపుణులలో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతుండడానికి మరికొన్ని కారణాలు. మహిళలు చాలా మంది కోక్కు అలవాటు పడిపోతున్నారు. దానిని ఒకసారి వాసన చూస్తే ఆకలి నశిస్తుంది. చాలా గంటల పాటు శక్తివంతంగా వుండేటట్లుగా చేస్తుంది. మహిళలు అనేక సమస్యల నుంచి తప్పించు కోవడానికి కూడా ఒక మార్గంగా మాదక ద్రవ్యాలను ఆశ్రయిస్తున్నారు. మాదక ద్రవ్యాల మీద ఆధారపడటం వల్ల జీవ రసాయనికంగా, మానసికంగా, సామాజికంగా దెబ్బతినడం, మందులలోని రసాయనిక పదార్థాలు నాడీ వ్యవస్థ మీద దాడి చేయడం, తీవ్రమైన ప్రవర్తనలు, కాలక్రమంలో ఆత్మీయులతో సంబంధాలు విచ్ఛిన్నం కావడం జరుగుతాయి. భారతదేశంలో కొకైన్పై వ్యసనపడుతున్న వారి సంఖ్య రానురానూ పెరుగుతోందని అధికారులు నిర్ధారిస్తున్నారు. UNODC వరల్డ్ డ్రగ్ రిపోర్ట్ ప్రకారం, 2020లో 275 మిలియన్ల మంది డ్రగ్స్ వాడారు. 36 మిలియన్ల మంది డ్రగ్స్ వినియోగ రుగ్మతలతో బాధపడుతున్నారు. డ్రగ్స్ ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయి మరియు భవిష్యత్తును దొంగిలిస్తున్నాయి, డ్రగ్స్ వాడకం మాత్రమే 2019లో దాదాపు అర మిలియన్ల మందిని చంపింది.గంజాయి చౌకగా దొరకడంతో చాలా మంది దీనికి బానిసలవుతున్నారు. మహారాష్ట్రకు చెందినవారే ఎక్కువగా ఈ పంట సాగుచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో అమాయక గిరిజనులకు మాయమాటలు చెప్పి వారి భూములను తక్కువధరకు కౌలుకు తీసుకుని అందులో నిషేధిత గంజాయి పండించి దొడ్డిదారిన రవా. లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రసాయనిక పరమైన మందులతో భారతదేశానికి వచ్చి గంజాయి లాంటి వాటిని తిరిగి తీసుకువెళ్లే విదేశీ పర్యాటకుల నుంచి వీటికి ఎక్కువ గిరాకీ లభిస్తోంది.

25 శాతం మంది శారీరక సమస్యలకు గురవుతారు. 42 శాతం ఒత్తిడికి, మానసిక సమస్యలతో బాధపడతారు. 25 శాతం మంది భార్యల నుండి విడాకులు కోరుతున్నారు. 40 శాతం నేరపూరిత ఆలోచనలతో గడుపుతున్నారు. యువత 45 శాతానికి పైగా సెక్స్ లో విఫలమవుతున్నారు. 24 శాతం మంది స్థూలకాయంలాంటి సమస్యలతో బాధపడుతుంటారు. మద్యం మత్తులోనే 90 శాతం నేరాలు. ఘోరాలు జరుగుతున్నాయి.

మాదక ద్రవ్యాలు నల్ల బజారులో అందుబాటులో ఉంటున్నాయి. వివిధ ప్రాంతాలలో సంకేత నామాలతో చెలామణిలో ఉన్నాయి, నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్, ఎల్ఎస్డీ ఇందులో ముఖ్యమైనవి. వీటిని కొందరు అక్రమ వ్యాపారాలతో దొంగ రవాణాకు పాల్పడుతూ కోట్లాది రూపాయలను గడిస్తుంటే, యువత వానిని వినియోగిస్తూ చెడిపోతున్నారు. వీటికి అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులవుతున్నారు. ఒకసారి దీనికి బానిసలైన తర్వాత వీటిని సంపాదించడానికి ఎంతటి అకృత్యాలు, నేరాలు చేయడానికైనా వారు వెనుకాడరు.మాదక ద్రవ్యాల నిరోధానికి భారత ప్రభుత్వం నార్కోటిక్స్, డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్స్టెన్సస్ చట్టాన్ని చేసింది. ఈ మత్తు మందులు పండించేవారు, వ్యాపారం చేసేవారు, కలిగివున్నవారు చట్టపరంగా కఠినంగా శిక్షార్హులు. మారక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేస్తూ, మాదక ద్రవ్యాలు తీసుకునే వారిని నేరస్థుల్లా చూడటం మానేసి, వారిని డీఅడిక్ట్ చేసేందుకు సహకారం అందించాల్సిన అవసరముంది. దీనికి తల్లి తండ్రులు, డాక్టర్లు, సమాజం, మీడియా కూడా సహకారం అందించాలి. ప్రతి ఏటా జూన్26న ప్రపంచ వ్యాప్తంగా మాదక ద్రవ్యాలను స్వాధీన పర్చుకుని దేశ దేశాల్లో బహిరంగంగా వాటిని తగులబెట్టడం, బహిరంగ సభలు, ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడం వంటి చర్యలను పెద్ద ఎత్తున ఐరాస ప్రోత్సహిస్తోంది. మాదకద్రవ్యాలు మానసికస్థితిపై ప్రభావం చూపడమే కాకుండా శరీరంలోని అన్ని అవయవాలను అస్తవ్యస్తం చేస్తాయి. వాటికి బానిసలై ఒక్కసారిగా దూరమైన వారి ప్రవర్తన చాలా భిన్నంగా ఉంటుంది. వీటికి అలవాటు పడి ప్రాణాలు కోల్పోతున్న వారెందరో. ఇంతకుముందు ఇరవై అయిదేళ్ల వయస్సులో వ్యసనాలకు లోనైన వారు ఇప్పుడు పదహారేళ్లకే ఈ పదార్థాలను వాడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. మత్తు పదార్థాల వాడకం వల్ల మెదడులో కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. వాటిని ఎండార్ఫిన్స్ అంటారు. 'మత్తు' ఉంటేనే ఎండార్ఫిన్స్ విడుదలవుతాయి. అవి దొరకని సమయంలో వారు నీరసంగా కనిపిస్తారు. కుటుంబ విలువలు విచ్ఛిన్నం కావడం, కుతూహలం, పిచ్చెక్కిస్తున్న పోటీ, భావోద్వేగ సమస్యలు, నిత్య జీవిత సమస్యల ఒత్తిడులు, చేతిలో డబ్బు బాగా ఆడడం యువకులలో, పెద్దలలో, వృత్తి నిపుణులలో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతుండడానికి మరికొన్ని కారణాలు.

# వ్యవసాయం ఉద్యమంలా....!




దేశాన్ని అనుక్షణం అప్రమత్తతతో కంటికి రెప్పలా కాపాడే సైనికులకు ఎంత ప్రాముఖ్యత ఉందో పట్టెడన్నం పెట్టే అన్నదాతలకు కూడా అంతే ప్రాముఖ్యత ఉంది. ఈ ప్రాధాన్యతను గుర్తించే దివంగత మలి ప్రధాని జై జవాన్... జై కిసాన్ అని నినదించారు. రైతును దేశానికి వెన్నుముకగా రైతులను అభివర్ణిస్తారు. రైతు అహర్నిశలు శ్రమిస్తే గాని మనకు తినడానికి తిండి దొరకదు. అయితే ఆరు గాలం కష్టపడినా, శ్రమకు ఫలితం లభిస్తుందనే నమ్మకం ఏ నాడూ ఉండదు. లేదు. రైతులు అటు ప్రకృతి మీద ఆధారపడి జీవనం సాగించడం సర్వత్రా కనిపించేదే. అతివృష్టి, అనావృష్టి అన్నదాతల జీవితాలకు భరోసా లేని పరిస్థితి తెస్తున్నాయి. ఒత్తిళ్లు, నష్టాలు, వ్యవసాయ పనుల చాకిరీకి తట్టుకోలేక చాలామంది రైతులు వ్యవసాయానికి స్వస్తి పలుకు తున్నారు. వేసిన పంటలకు సరిగా దిగుబడి రాక అప్పుల బాధలు భరించలేక, సరైన సమయంలో రుణమాఫీ కాక, దిక్కుతోచని స్థితిలో రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కౌలు రైతులకైతే స్వంత భూమి కాక, వ్యవసాయ రుణాలు రాక, ప్రభుత్వ సహాయంకు నోచుకోక, యాజమాని కాకపోవడం వల్ల ప్రైవేటు రుణ సాయం దొరకక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ పంటలు పండిస్తే దళారులు రైతుల శ్రమను చౌకగా కొని ఎక్కువ రేట్లకు కొనుగోలు దార్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రైతులు కూలీగా, దళారులు సంపన్నులుగా అవుతున్నారు. పంటల విషయంలో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయ శాఖలో సిబ్బంది కొరత రైతులకు అవగాహన లేమికి కారణం అవుతోంది. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు గత కాలంలో లాగా కాకుండా ప్రస్తుతం రైతులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాయి. రైతులకు ఆర్థిక సాయం అందిస్తూ, నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు బట్వాడా చేస్తున్నాయి. అయితే నకిలీ విత్తనాలు రాకుండా, గిట్టుబాటు ధర ఇవ్వాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వాలదే. సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి. రైతులు దళారీల బారిన పడకుండా చూడాలి. రైతును వివిధ రకాలుగా మోసం చేసే వారిపై కఠిన చర్యలు గైకొనాలి. ప్రభుత్వ చేయూత, ఆర్థిక సాయం, సబ్సిడీలు, రుణ మాఫీలు, మార్కెట్ సౌకర్యాలు అందుబాటులో ఉండి, గతంలో సాగునీటికి పడిన ఇబ్బందుల పరిస్థితి కొంత మెరుగుపడి, సేద్యానికి అవసరమయ్యే సాగు నీరు అధిక శాతం సరఫరా అవుతున్న వేళ...వ్యవసాయం ఉద్యమం రీతిలో ముందుకు సాగాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. రైతును దేశానికి వెన్నుముకగా రైతులను అభివర్ణిస్తారు. రైతు అహర్నిశలు శ్రమిస్తే గాని మనకు తినడానికి తిండి దొరకదు. అయితే ఆరు గాలం కష్టపడినా, శ్రమకు ఫలితం లభిస్తుందనే నమ్మకం ఏ నాడూ ఉండదు. లేదు. రైతులు అటు ప్రకృతి మీద ఆధారపడి జీవనం సాగించడం సర్వత్రా కనిపించేదే. అతివృష్టి, అనావృష్టి అన్నదాతల జీవితాలకు భరోసా లేని పరిస్థితి తెస్తున్నాయి. ఒత్తిళ్లు, నష్టాలు, వ్యవసాయ పనుల చాకిరీకి తట్టుకోలేక చాలామంది రైతులు వ్యవసాయానికి స్వస్తి పలుకు తున్నారు.

# రపార్లమెంట్‌కు ట్రాక్టర్‌పై సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్




**న్యూఢిల్లీ :** రైతు నేత, సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్ పార్లమెంట్‌కు ట్రాక్టర్‌పై వెళ్లారు. సోమవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. తొలిరోజు సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. అయితే రాజస్థాన్‌లోని సికార్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) తరపున గెలిచిన అమ్రారామ్ పార్లమెంట్‌కు ట్రాక్టర్‌పై వెళ్లారు. రైతులు తమ వ్యవసాయ పనుల్లో ట్రాక్టర్‌ను వాడుతారు. ఇప్పుడు ట్రాక్టర్ రైతు పని ముట్టుగా తయారు అయింది. ఇటీవలి కాలంలో దేశంలో జరిగిన చారిత్రాత్మక రైతు పోరాటంలో రైతులతో పాటు ట్రాక్టర్లు కూడా వేలాదిగా పాల్గొన్నాయి. రైతులు తమతో పాటు ట్రాక్టర్లు తీసుకొచ్చి ఆందోళనలు చేపట్టారు. రైతు ఉద్యమానికి ట్రాక్టర్లు కొండంత అండగా నిలిచాయి. అప్పుడు కొన్నాళు ఢిల్లీలోని పార్లమెంట్, ఇండియా గేట్, కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యాలయాలున్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు నిషేధించారు. అప్పటి నుంచి మోడీ సర్కార్‌లో ట్రాక్టర్ అంటే భయం పట్టుకుంది. అలాంటి ట్రాక్టర్‌పై సీపీఐ(ఎం) లోక్‌సభ ఎంపీ అమ్రారామ్ పార్లమెంట్‌కు రావడం ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. అక్కడ ఉన్న అనేక మంది ట్రాక్టర్‌పై వచ్చిన ఎంపిని చూస్తూ అభినందనలు తెలిపారు. అయితే ట్రాక్టర్‌పై అమ్రారామ్ పార్లమెంట్‌కు చేరుకోగానే భద్రతా సిబ్బంది ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. పార్లమెంట్ లోపలకి వెళ్లడానికి లేదని పోలీసులు అడ్డుకుంటే, ఎంపి అమ్రారామ్ ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. ఒకప్పుడు నిరసన తెలుపుతూ పార్లమెంట్‌కు ఎడ్లబండి మీద వెళ్లిన ఘటనలు ఉన్నాయి. దేశంలోని రైతు ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న రోజుల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా ట్రాక్టర్‌పై పార్లమెంట్‌కు వచ్చారు. అయితే ఆయనను కూడా పార్లమెంట్ గేటు వద్దనే పోలీసులు అడ్డుకున్నారు.

## చంద్రమండల యాత్రలో చరిత్ర సృష్టించిన చైనా



బీజింగ్ : చంద్ర మండల యాత్రలో చైనా మరో ఘనత సాధించింది. ప్రపంచ చరిత్రలో తొలిసారి జాబిల్లికి ఆవలివైపు నమూనాలను సేకరించి వాటిని విజయవంతంగా భూమిపైకి తీసుకు వచ్చింది. చంద్రుడి రెండో వైపు నుంచి మట్టి , శిథిలాలను మోసుకొని లూనార్ ల్యాండర్ చాంగే 6 వ్యోమనౌక మంగళవారం భూమికి చేరుకుంది. ఉత్తర చైనాలోని ఇన్నర్ మంగోలియన్ ప్రాంతంలో ఇది సురక్షితంగా దిగినట్టు డ్రాగన్ వెల్లడించింది. మే 3 వ తేదీన చాంగే 6 నింగికెగిరి , దాదాపు 53 రోజుల పాటు ప్రయాణించి జాబిల్లిని చేరింది. జూన్ 2 న జాబిల్లి ఆవలివైపున సౌత్ పోల్ అయిట్కిన్ ప్రాంతంలో ఉన్న అపోలో బేసిన్‌లో అది సురక్షితంగా చంద్రుడి ఉపరితలాన్ని తాకింది. ఈ మిషన్‌లో ఆర్బిటర్, ల్యాండర్, అసెండర్, రిటర్నర్, అనే నాలుగు భాగాలున్నాయి. జాబిల్లి ఉపరితలంపై ఉన్న నమూనాలను రోబోటిక్ హస్తం సాయంతో సేకరించింది. డ్రిల్లింగ్‌యంత్రాన్ని ఉపయోగించి దిగువనున్న ప్రాంతం నుంచి మట్టిని తీసుకుంది. అనంతరం వాటిని తీసుకుని భూమికి వచ్చేసింది. చాంగే 6 తీసుకు వచ్చిన నమూనాల్లో 2.5 మిలియన్ సంవత్సరాల పురాతన అగ్నిపర్వత శిలలు కూడా ఉండవచ్చని చైనా శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ నమూనాలను అధ్యయనం చేస్తే చంద్రుడికి రెండు వైపులా ఉన్న భౌగోళిక వ్యత్యాసాలకు సంబంధించిన అనేక ప్రశ్నలకు సమాధానం దొరుకుతుందని విశ్వాసంగా ఉన్నారు. చందమామకు సంబంధించిన ఒక భాగం మాత్రమే భూమి నుంచి కనిపిస్తుంది. ఇవతలి భాగాన్ని నియర్‌సైడ్‌గా పేర్కొంటారు. రెండో పార్శ్వాన్ని ఫార్‌సైడ్‌గా పిలుస్తారు. ఇప్పటివరకు అమెరికా సోవియెట్ యూనియన్‌తోపాటు చైనా కూడా పలుమార్లు నియర్ సైడ్ నుంచి నమూనాలను సేకరించి భూమికి తీసుకు వచ్చాయి.

# కుప్పంలో విమానాశ్రయం...

## నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించిన చంద్రబాబు



అమరావతి : కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గం గా అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ముఖ్యమంత్రి గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మొట్టమొదటిసారి తన నియోజకవర్గం కుప్పంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో నియోజకవర్గ ప్రజలకు వరాలు కురిపించారు. వచ్చే ఐదేళ్లలో కుప్పం నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని వెల్లడించారు. అన్నింట్లో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. కుప్పంలో రౌడియిజం చేసే వారికి ఇదే చివరి రోజని అన్నారు. ఇకపై రౌడీయిజం, గంజాయి, అక్రమ వ్యాపారాలు చేసే వీలు లేదని వివరించారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, అభివృద్ధిని పరుగుపెట్టిస్తానని తెలిపారు. నియోజకవర్గానికి వందకోట్లు కాదు. ఎన్నికోట్లయినా ఇస్తా, అవుటర్ రింగ్, టౌన్‌రోడ్లు, అన్ని సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తామని అన్నారు.

**కుప్పం నియోజకవర్గానికి విమానాశ్రయం**

నియోజకవర్గంలో రైతులు పండించిన పంటలు, వివిధ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతులు చేసేందుకు విమానాశ్రయం ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటానని తెలిపారు. నియోజకవర్గ రైతులు అన్ని రకాల పంటు పండిస్తున్నారని,వారు పండించే పంటలకు సరైనా గిట్టుబాటు కల్పించడంతో పాటు విదేశాల్లోనూ కుప్పం రైతులకు గుర్తింపు తీసుకువస్తామని అన్నారు.

**రెండు నూతన మండలాల ఏర్పాటు**

ప్రజల కోరిక మేరకు నియోజకవర్గంలో మరో రెండు మండలాల ఏర్పాటుకు చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న రెండు మండలాలకు అదనంగా మల్లనూరు, రాళ్లవరుగూరి మండలాలు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాలకు రూ.4 కోట్లచొప్పున, మేజర్ పంచాయతీలకు రెండుకోట్లు, మైనర్ పంచాయతీలకు కోటి రూపాయల చొప్పున మంజూరు చేశారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నీరు, ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా మంచినీరు అందజేస్తానని వెల్లడించారు. రాబోయే రోజుల్లో కరువు నీరు రాకుండా చర్యలు తీసుకుంటానని, అవసరమైతే లిఫ్టల ద్వారా నీరందిస్తానని తెలిపారు. కుప్పంను విద్యా హబ్‌గా చేస్తానని అన్నారు.

## మమ్మల్ని సంప్రదించకుండా తీస్తా జలాలపై బంగ్లాదేశ్‌తో చర్చలొద్దు




**కోల్‌కతా :** తీస్తా, గంగా నదీజలాలకు సంబంధించి బంగ్లాదేశ్‌తో తాజా చర్చల్లో కేంద్ర ప్రభుత్వం తమ రాష్ట్రాన్ని భాగస్వామ్యపక్షంగా చేర్చలేదంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.తమను కలుపుకోకుండా ఈ వ్యవహారాల్లో ఆ దేశంతో సంప్రదింపులేవీ జరపొద్దని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మమత సోమవారం ఈ మేరకు మూడు పేజీల లేఖ రాశారు. "బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో దిల్లీలో ఇటీవల మీరు జరిపిన ద్వైపాక్షిక చర్చల్లో తీస్తా జలాలు, ఫరక్కా ఒడంబడికకు సంబంధించిన అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. మా రాష్ట్రాన్ని సంప్రదించకుండా, మా అభిప్రాయం తెలుసుకోకుండా బంగ్లాదేశ్‌తో అలాంటి ఏకపక్ష చర్చలు తగవు. అలాంటి చర్చలతో బెంగాల్ ప్రజలు తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఎదుర్కోవాల్సి వచ్చే ముప్పుంది" అని అందులో పేర్కొన్నారు. బంగ్లాతో తమ రాష్ట్రానికి భౌగోళికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా చాలా సన్నిహిత సంబంధాలు ఉన్న సంగతిని మమత గుర్తుచేశారు. అయితే ఆమె ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. బంగ్లాదేశ్‌తో గంగా జలాలకు సంబంధించిన ఒప్పందం గురించి బెంగాల్ సర్కారు ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తమ అభిప్రాయాన్ని తెలియజేసినట్లు పేర్కొంది.

## అమెరికా ఆరోపణలు నిజమే..

# నేరాన్ని అంగీకరించిన అసాంజే

వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే నేరాన్ని అంగీకరించేందుకు సిద్ధమయ్యారు. గూఢచర్యం ఆరోపణలను ఎదుర్కొంటున్న అసాంజే.. అమెరికా న్యాయ విభాగంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో, ఆయన జైలు జీవితానికి స్వస్తి చెప్పి స్వదేశానికి తెరిగివెళ్లనున్నారు. కోర్టులో ఆయన సమర్పించిన పత్రాల ద్వారా ఈ విషయం బయటపడింది. విచారణకు హాజరయ్యేందుకు వీలుగా ఆయన్ను యూకే జైలు నుంచి మంగళవారం ఉదయం విడుదల చేశారు. ఈ పరిణామంతో రహస్య పత్రాల ప్రచురణ కేసు ముగింపునకు చేరుకుంది. పశ్చిమ పసిఫిక్‌లోని యూఎస్ కామన్వెల్త్ మరియానా ఐలాండ్స్‌లోని ఫెడరల్ కోర్టులో అసాంజే విచారణకు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. గూఢచర్యం చట్టానికి విరుద్ధంగా జాతీయ భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పొందడం, వ్యాప్తి చేయడం వంటి నేరారోపణలను అంగీకరించనున్నారని డాక్యుమెంట్లలో ఉంది. దీన్ని జడ్జి ఆమోదించాల్సి ఉంది. ఒకవేళ అదే జరిగితే, అమెరికా చేసిన ఆరోపణలు నిజమవుతాయి.



నేరాంగీకారం, శిక్ష ఖరారు తర్వాత అసాంజే ఆస్ట్రేలియా చేరుకోనున్నారు. మరియానా ఐలాండ్స్ లోని సైపన్ కోర్టులో బుధవారం ఆయన హాజరుకానున్నారు. అమెరికాకు రావడానికి ఆయన నిరాకరించారు. అందువల్లే, సైపన్ కోర్టులో విచారణ చేపడుతున్నారు. పైగా అమెరికా అధీనంలో ఉండే మరియానా ఐలాండ్స్ ఆస్ట్రేలియాకు సమీపంలో ఉంటుంది. ఒప్పందంలో భాగంగా అసాంజే నేరాన్ని అంగీకరించారు. దీంతో, అదనపు జైలు శిక్ష నుంచి ఆయనకు విముక్తి లభించాల్సి ఉంటుంది.

# కేరళ రాష్ట్రం పేరు కేరళం...!



**తిరువనంతపురం :** కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చేందుకు, ఈ పేరు మార్పుకు అవసరమైన రాజ్యాంగ సవరణకు ప్రతిపాదిస్తూ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానాన్ని సోమవారం ఆమోదించింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఫస్ట్ షెడ్యూల్‌లో ఈ పేరు మార్పును అమల్లోకి తెచ్చేందుకు భారత రాజ్యాంగంలోని 3వ అధికరణను అమలు చేయాలని తీర్మానం పిలుపిచ్చింది. గతేడాది కూడా ఇదే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానాన్ని పంపింది. కానీ అందుకు అనుసరించిన తీరు సరిగా లేదనే కారణంతో కేంద్రం వెనక్కి పంపింది. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషల్లోనూ కేరళ పేరును సవరించాలని తొలుత రాష్ట్రం కోరింది. అయితే, కేంద్ర హెూం శాఖ నుంచి అందిన సూచనల మేరకు, ఫస్ట్ షెడ్యూల్‌లో సవరణపైనే దృష్టి కేంద్రీకరించింది. 2023 ఆగస్టు 9న అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని సవరించడానికి ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. కేరళం అనేది రాష్ట్రానికి సంబంధించి మలయాళం పేరని, అధికారికంగా కేరళ అనే కొనసాగుతుందని విజయన్ తెలిపారు. అధికారిక పేరును మలయాళం ఉచ్చారణతో సమం చేయడానికి ఈ తీర్మానం ఉద్దేశించబడింది.

# మళ్ళీ మొదలైన బిజెపి దాడి......!

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల తీర్పు ప్రత్యేకంగా చెప్పుకోదగింది. తాము ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ఎంత విలువ ఇస్తామో ఈ తీర్పు ద్వారా ప్రజలు చాటి చెప్పారు. 2014లోనూ, 2019లోనూ పరిపూర్ణ ఆధిక్యత తెచ్చుకున్న బిజెపికి ఈసారి ప్రజలు ఆ అవకాశం నిరాకరించారు. 303 స్థానాలున్న బిజెపి సీట్ల సంఖ్య ఈసారి 240కి పడిపోయింది. అంటే 21% తగ్గింది. ఎన్‌డిఎకు 292, 'ఇండియా' వేదికకు 234 స్థానాలు వచ్చాయి. మోడీ పదేళ్ల పాలన నేపథ్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ పాలన మొత్తం లక్షణం నియంతృత్వ పోకడలతో హిందూత్వ, మతతత్వ ఎజెండాను అమలు జరిగింది. రాజ్యాంగ వ్యవస్థలో ప్రతి అంగమూ దిగ్బంధానికి గురైంది.రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట పెట్టుకోవడానికి దారితీసింది.ఎన్నికల సన్నాహక దశలోనే ఇది ప్రతిబింబించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా పెట్టుకుని దాడి చేశాయి. ఇద్దరు ముఖ్యమంత్రులు జైళ్ల పాలయ్యారు. కాంగ్రెస్, సిపిఐ(ఎం)వంటి రాజకీయ పక్షాలపై కక్ష సాధింపు సాగింది. ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షానికి సమాన అవకాశం లేకుండా పోయింది. ఈ విషయంలోఎన్నికల కమిషన్ శోచనీయమైన పాత్ర పోషించింది. వెన్నెముకలేని కమిషనర్లతో నియమించబడిన ఎన్నికల కమిషన్ ఎన్నికల నియమావళి ఘోర ఉల్లంఘనలను శిక్షించడంలో గట్టిగా నిలబడలేక విఫలమైంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాలలో ముస్లింలపై విషం కక్కుతున్నా హద్దు అదుపూ లేకపోయింది. పోలింగ్ శాతానికి సంబంధించిన లెక్కలను క్రోడీకరించడంలో పారదర్శకత చూపించలేక అనవసర సందేహాలకూ తావిచ్చింది.ఈ కీలక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతకు విఘాతమేర్పడింది. కార్పొరేట్ మీడియావరణాన్ని పూర్తిగా బిజెపి గుత్తాధిపత్యంలోకి తెచ్చుకుంది. సోషల్ మీడియాలోనూ భారీ వనరులు గుమ్మరించింది. ప్రచారంలోనూ ఓటర్లకు పంచిపెట్టడం కోసమూ వేల కోట్లు వెచ్చించింది.ఈ మొత్తం ప్రచారంలో మోడీ, ఆయన హంగుదార్లు 'ఇండియా' వేదికలోని పార్టీల పట్ల బెదిరింపులు, మోసగింపు ఎత్తుగడలకు పాల్పడ్డారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితులలోనే 'ఇండియా' వేదిక పార్టీలు ఎన్నికల ప్రచారం నిర్వహించవలసి వచ్చింది. మోడీ పచ్చిమతోన్మాద పల్లవికి వ్యతిరేకంగా ప్రతిపక్షం నిరుద్యోగం, ఉద్యోగాలు, ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం వంటి అంశాలను ముందుకు తెచ్చింది. హిందూత్వ శక్తుల నుంచి ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ఎదురవుతున్న ప్రమాదాలపై దృష్టి సారించేలా చేసింది. మొట్టమొదటిసారిగా రాజ్యాంగ రక్షణ అంశం విశాల ప్రజారాశులను మరీ ముఖ్యంగా దళితులను ఆకట్టుకుంది. బిజెపి మెజారిటీ కోల్పోవడంలో ఉత్తరప్రదేశ్‌లో దానికి తగిలిన ఎదురు దెబ్బ కీలకమైంది. అక్కడున్న 80 స్థానాలలోనూ గతంలో 62 వస్తే ప్రస్తుతం 33 మాత్రమే పొందగలిగింది. హిందూత్వ రాజకీయాలకు ఉత్తరప్రదేశ్ గుండెకాయ లాంటిది. అయోధ్యలో రామ మందిరం, హిందూ దురభిమాన ఎజెండాకు ప్రతీక లాంటిది. ఇవన్నీ ఉన్నా బిజెపి ఓట్లు 9% తగ్గిపోయాయి. నిరుద్యోగ సమస్య మూకుమ్మడి ప్రభావం, ధరల పెరుగుదల, రైతుల అసంతృప్తి, అగ్నివీర్ పథకంపై యువత అసంతృప్తి, పరీక్షా పత్రాల లీకేజీ వంటి అంశాలే మతతత్వ సమీకరణను మించిన ప్రభావం చూపించాయి. సమాజ్ వాది పార్టీ చాకచక్యంగా నడిపిన కుల సమీకరణ రాజకీయాలు ఇందుకు తోడైనాయి. అయోధ్యకు నెలవుగా వున్న ఫైజాబాద్ లోక్‌సభ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించే బిజెపి సభ్యుడు ఓడిపోవడం ఓటరు ఎంత దూరమైనారో కళ్లకుకట్టే కఠోర వాస్తవంగా నిలిచింది. ఎగ్జిట్ ప్రహసనం ఏడవ చివరి దశ పోలింగ్ ముగిశాక వెల్లువగా వచ్చిన ఎగ్జిట్ పోల్స్ ఎన్‌డిఎ గొప్ప విజయం సాధించబోతున్నదన్న చిత్రణ ఇచ్చాయి. సగటున చూస్తే బిజెపికి కనీసంగా 367 వస్తాయని చెప్పాయి. ప్రతిపక్షాలను డీలా పడేసి పాలక పార్టీ ఆధిపత్యానికి కొమ్ముకాయడానికి ప్రయోగించిన ఆయధాలే ఇవి. మరింత లోతైన ఉద్దేశం మీడియా కార్పొరేట్ కూటమితో స్టాక్ మార్కెట్లో లాభాలు కొల్లగొట్టడం. దీనంతటి వల్ల ముంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో మదుపరుల పెట్టుబడి రూ. 14 లక్షల కోట్లు పెరిగింది. ఎపి, ఒడిశా పాతాలు పార్లమెంటుతో పాటు శాసనసభ ఎన్నికలు జరిగిన ఒడిశాలో బిజూ జనతాదళ్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్‌ఆర్‌సిపి ఈ ఎన్నికల్లో అధికారం కోల్పోయాయి. అవి లోక్‌సభ ఎన్నికలలో దెబ్బతినడమేగాక రాష్ట్ర ప్రభుత్వాలను పోగొట్టుకున్నాయి. ఒడిశాలోని 21 లోక్‌సభ స్థానాలలో బిజెపి 20 స్థానాలు తెచ్చుకోవడమే గాక శాసనసభలోనూ మెజార్టీ తెచ్చుకుంది. మోడీ ప్రభుత్వంతో జతకట్టే లేదా వత్తాసునిచ్చే ప్రాంతీయ పార్టీలకు ఈ రెండు రాష్ట్రా లూ ఒక గుణపాఠం నేర్పుతున్నాయి. బిజెపిని గట్టిగా వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీలు డిఎంకె, సమాజ్ వాదీ పార్టీ, ఆర్‌జెడి వంటివే నిలదొక్కుకుని మరింత బలోపేతమైనాయి. బిజెపి ఇంత గట్టి దెబ్బ తిందంటే దానికి పూర్తి కారకుడు మోడీనే. దీని వెనక అసలు కుట్రదారి బిజెపినే. ఆ పార్టీ ఎన్నికల ప్రణాళిక కూడా మోడీకే గ్యారంటీ అని నామకరణమైంది. మోడీ చుట్టూ సృష్టించబడిన అత్వం కథలు కకావికలైపోయాయి. ఎన్‌డిఎ మిశ్రమ ప్రభుత్వ ఏర్పాటుతోనైనా మోడీ, అమిత్ షాల బరితెగింపు పోకడలకు కళ్లెంపడుతుందని ఆశించాలి. ఎన్‌డిఎకు మూడింట రెండు వంతుల బలమేమీ వుండబోదు. ఒకే దేశం, ఒకే ఎన్నిక వంటి అనేక పథకాలను తీసుకొచ్చే ఆలోచనలు దీంతో ఛిన్నాభిన్నమైనట్టే. మూడో దఫా అధికారంలోకి రాగానే ఏకకాలంలో ఎన్నికల వ్యవస్థ తీసుకొస్తామని అమిత్ షా వాగ్దానం చేశారు. దాని కోసం అవసరమైన అనేక రాజ్యాంగ సవరణలు తీసుకొస్తామన్న ఆయన మాట ఇక అమలు జరిగేది కాదు. 'ఇండియా' అనుభవాలు ఏమైనా నిరంతరం అప్రమత్తంగా వుండటం ఇప్పటికీ అవసరమే. ఎందుకంటే నిరంకుశ హిందూత్వ లక్షణాలు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూటమి జన్యుధాతువుల్లోనే వున్నాయి.

# యాలకులు, మిశ్రి కలిపి తినడం వల్ల ఈ రోగాలు అన్నీ పరార్..!



యాలకులు, మిశ్రి కలిపి తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఎందుకంటే ఈ రెండు ఆహార పదార్థాల్లో ఉండే పోషకాలు ఎన్నో రకాల వ్యాధులను నయం చేస్తాయి. మిశ్రిని ఆరోగ్య పరంగా చక్కెరకు పూర్తిగా భిన్నమైనదిగా పరిగణిస్తారు. చక్కెర రోజువారీ ఉపయోగం మానవ ఆరోగ్యానికి విషంగా పరిగణించబడుతుంది. కానీ, మిశ్రి చాలా ప్రయోజనాలను కలిగి ఉంది. యాలకులు, మిశ్రి శరీరానికి బలాన్ని ఇస్తాయి. ఈ రెండింటినీ కలిపి తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.. యాలకులు మిశ్రి కలిపి తినడం వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు శరీరానికి బలాన్ని ఇవ్వడమే కాకుండా, నోటి దుర్వాసనను తొలగించడంలో సహాయపడుతుంది. నోటి పుండ్ల సమస్య నుంచి బయటపడటానికి సహాయపడుతుంది. యాలకులు, మిశ్రిలో పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్ లక్షణాలు శరీర బరువును అదుపులో ఉంచుతాయి. రక్తపోటును నియంత్రణలో ఉంచుతాయి. అలాగే యాలకులు, మిశ్రి కలిపి తినడం వల్ల జీర్ణ వ్యవస్థను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. ఇది గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఏలకులు, మిశ్రి తీసుకోవడం వల్ల ఇతర ఆహారాన్ని తక్కువగా తీసుకుంటారు. దీంతో శరీర బరువు, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. శరీరం బలహీనంగా ఉంటే యాలకులు, మిశ్రి రోజూ తీసుకోవాలి. ఈ మిశ్రమంలోని పోషకాలు శరీర శక్తిని పెంచడానికి సహాయపడతాయి. రోగనిరోధక శక్తి బలపడుతుంది. దీని ద్వారా మీరు అనేక రకాల అంటు వ్యాధుల నుంచి బయటపడవచ్చు. శరీర జీవక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. యాలకులు, మిశ్రి తీసుకోవడం వల్ల నోటి అల్సర్ సమస్య నుండి త్వరగా ఉపశమనం లభిస్తుంది. మీ మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. ఇది ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది.

# బరువు తగ్గాలనుకుంటున్నారా.....?

ఈ రోజుల్లో బరువు పెరగడం అనేది ఒక తీవ్రమైన సమస్యగా మారింది. ప్రపంచంలో చాలా మంది ఈ సమస్యతో సతమతమవుతున్నారు. గుండె జబ్బులు, అధిక రక్తపోటు, ఫ్యాటీ లివర్, పెరిగిన కొలెస్ట్రాల్, జీర్ణ సమస్యలు, డిప్రెషన్ వంటి అనేక తీవ్రమైన వ్యాధులకు ఈ సమస్యే ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. అందుకే చాలా మంది బరువు తగ్గాలని ప్రయత్నిస్తుంటారు. బరువు తగ్గేందుకు చాలా మంది రకరకాలుగా కష్టపడుతుంటారు. అయితే అది అంత సులభం కాదు. బరువు తగ్గించే ప్రక్రియ సుదీర్ఘ ప్రక్రియ. ముఖ్యంగా, దీనికి చాలా ఓపిక అవసరం. మీరు వెంటనే బరువు తగ్గాలనుకుంటే అది సాధ్యం కాదు. ఇందుకోసం మీరు మీ ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కొన్ని మంచి అలవాట్లను అనుసరించాలి. ఉదయం లేవగానే కొన్ని అలవాట్లు పాటిస్తే.. కచ్చితంగా త్వరగా బరువు తగ్గొచ్చు.. అదేంటో ఈ పోస్ట్ లో చూద్దాం. అధిక ప్రోటీన్ అల్పాహారం: అల్పాహారం మనందరికీ చాలా ముఖ్యమైనది. కానీ మీరు బరువు తగ్గాలనుకుంటే, మీరు తప్పనిసరిగా అధిక ప్రోటీన్ కలిగిన అల్పాహారం తినాలి. ఎందుకంటే ఇది తరచుగా తినాలనే కోరికను తగ్గిస్తుంది. భోజనం వరకు ఆకలి అనుభూతిని కలిగించదు. ఉదాహరణకు, గుడ్లు, నట్స్, చియా విత్తనాలను అల్పాహారంగా తీసుకోవచ్చు. పుష్కలంగా నీరు త్రాగండి: ఉదయం ఖాళీ కడుపుతో రెండు గ్లాసుల గోరువెచ్చని నీటితో మీ రోజును ప్రారంభించండి. ఇది శరీరానికి శక్తిని అందిస్తుంది. శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుతుంది. బరువు తగ్గడంలో సహాయపడుతుంది అని మీకు తెలుసా? ప్రత్యామ్నాయంగా, మీరు సాధారణ నీరు లేదా నిమ్మకాయ నీటితో మీ రోజును ప్రారంభించవచ్చు. ఇది జీర్ణ సమస్యల నుండి కూడా ఉపశమనం కలిగిస్తుంది. విటమిన్ డి తప్పనిసరి: శరీరంలో విటమిన్ డి లేకపోవడం వల్ల బరువు పెరుగుతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల, బరువు తగ్గాలనుకునే వారికి ఉదయం సూర్యరశ్మిలో కొంతసమయం గడపడం చాలా మంచిది. ఎందుకంటే ఇది విటమిన్ డిని





సరఫరా చేస్తుంది. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తుంది. ఉదయం వ్యాయామం అవసరం: ఉదయం వ్యాయామం చాలా ముఖ్యం. ఇది బరువును తగ్గించడమే కాకుండా రక్తంలో చక్కెరను అదుపులో ఉంచుతుంది. కాబట్టి, బరువు తగ్గాలనుకునే వారు ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన తర్వాత వ్యాయామం చేయడం అలవాటు చేసుకోండి.

# బీర్ తాగితే కొలెస్ట్రాల్ కరిగిపోతుందట!




ఈ రోజుల్లో అన్ని రకాల పార్టీలలో కనిపించే పానీయం బీర్. ఈ బీర్ తాగడం వల్ల కలిగే లాభనష్టాల గురించి తరచూ వింటూనే వింటాం. చాలా వాదనలు ఉన్నాయి. కానీ, బీర్ తాగడం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుతుందని ఓ పరిశోధనలో తేలింది. ఆల్కహాల్‌లో బీర్ ఎక్కువగా వినియోగించబడే మద్యం. ఇది ఇతర హార్డ్ మద్యం కంటే తక్కువ ఆల్కహాల్ కలిగి ఉంటుంది. అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. విటమిన్ బి, ప్రోటీన్, ఫైబర్ వంటి కొన్ని పోషకాలు బీరులో ఉంటాయి. ఒక పరిశోధన ప్రకారం, పరిమిత పరిమాణంలో బీర్ తీసుకుంటే అది కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తుంది. బీర్‌లో 125 కేలరీలు మాత్రమే ఉన్నాయి. బీర్ శరీరంలో ఎల్‌డిఎల్‌కు బదులుగా హెచ్‌డిఎల్ స్థాయిని పెంచుతుంది. ఇది సిరలను ఆరోగ్యంగా ఉంచుతుంది. బీర్‌లో ఫోలిక్ యాసిడ్‌తో సహా బి విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇది గుండెపోటును నివారించడంలో సహాయపడుతుంది. డయాబెటిక్ పేషెంట్లు బీరు ఎక్కువగా తాగితే శరీరంలో ఇన్సులిన్ స్థాయి క్షీణించే అవకాశం ఉంది. ఇంకా బీర్ ఇతర ఆరోగ్య ప్రయోజనాలు పరిశీలించినట్టయితే, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడం, మధుమేహం నియంత్రణ, మూత్రపిండాల్లో రాళ్లను నివారించడం నుండి కొలెస్ట్రాల్, రక్తంలో గడ్డలు వంటివి తగ్గించడం చేస్తుంది. ఇది జీర్ణక్రియ, బోలు ఎముకల వ్యాధి, ఎముకల ఆరోగ్యం, అధిక రక్తపోటుకు కూడా సహాయపడుతుంది. బీర్‌లో హిమోగ్లోబిన్‌ను నిర్వహించడానికి, రక్తహీనత చికిత్సకు సహాయపడే విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇది గుండెను రక్షిస్తుంది. వివిధ హృదయ సంబంధ వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. బీర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

# పల్లీలే కదా అని లైట్ తీసుకుంటున్నారా!



వేరు శనగపప్పు ప్రతి సామాన్యుడు ఇంట్లో ఉండే వస్తువు. దీనిలో మాంసంలో వున్నంత బలం వుంటుంది. మార్కెట్లో చాలా తక్కువ ధరకే ఇవి మనకు అందుబాటులో ఉంటాయి. డ్రై ఫ్రూట్స్‌కు ఏమాత్రం తగ్గకుండా ఈ వేరుశెనగపప్పులు వుంటాయ్. అయితే వీటిని తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో మనం ఇక్కడ తెలుసుకుందాం.. 100 గ్రాముల వేరుశెనగల్లో 560 క్యాలరీల శక్తి లభిస్తుంది. అందులో 25 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. 45 గ్రాముల కొవ్వు ఉంటుంది. వీటిని ఎండబెట్టి గ్రైండ్ చేస్తే నూనె వస్తుంది. పచ్చిగా గ్రైండ్ చేస్తే పాలు వస్తాయి. వేపిన తరువాత గ్రైండ్ చేస్తే బటర్ వస్తుంది. మేక మాంసం లో కన్నా పల్లీల్లో ఎక్కువ ప్రోటీన్ ఉంటుంది. 100 గ్రాముల మేక మాంసంలో 21 గ్రాముల ప్రోటీన్ వుంటే ఈ 100 గ్రాముల పల్లీల్లో 25 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. పల్లీలను 8 గంటలు నానబెట్టి తర్వాత బాగా ఉడికించాలి. 10 నిమిషాలు ఉడకబెడితే అవి మెత్తగా టేస్టీగా బాగుంటాయి. ఈ ఉడకబెట్టిన పల్లీలు తింటే గర్భిణులకు చాలా మంచిది. బరువు పెరగడం లేదనుకునే వారికి కూడా ఈ వేరుసెనగ పప్పు బాగా పనిచేస్తాయి. ఇవి కడుపులో కూడా చాలా సులభంగా జీర్ణం అవుతాయి. బలం కోసం బాదం, కాజూ మాత్రమే కాకుండా ఈ పల్లీలను కూడా తినవచ్చు. అదేవిధంగా వేరుశెనగల్లో అనేక ఔషధ గుణాలున్నాయి. రైబోఫ్లేవిన్, థియామిన్, బి6 విటమిన్, కాపర్, మాంగనీస్, పొటాషియం, జింక్, సెలీనియం, క్యాల్షియం, ఐరన్ లాంటి పోషకాలు ఉన్నాయి. వీటిలో మోనో అన్ సాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు వున్నాయ్. ఇవి గుండె కండరాల పనితీరును మెరుగు పరుస్తాయి. రక్తంలో వుండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. గుండెపోటు రాకుండా నివారిస్తుంది. పక్షవాతం కూడా రాకుండా నివారిస్తుంది. పల్లీలు రంగుమారిన.. తినేటప్పుడు చేదుగా అనిపించినా తినవద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే రంగు మారిన పల్లీల్లో విషపదార్థాలు వుండే అవకాశం వుంది. వేరుశనగ పప్పు తినడం వల్ల మానసిక సమస్య కూడా తగ్గుతుంది. ఇందులో వుండే ట్రిప్టోఫాన్ శరీరంలోకి వెళ్లిన తరువాత సిరొటోనిన్‌గా మారి మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. అలాగే మూత్రపిండాల్లో రాళ్లు రాకుండా కూడా దోహదం చేస్తాయి. పల్లీల్లో పీచు పదార్థం ఎక్కువగా వుంటుంది. పల్లీలపై పొట్టు తీయకుండ అలాగే తినాలి. వీటిని వేయించినా ఉడకబెట్టిన పొట్టుతోనే తినాలి.

# పంటి నొప్పితో బాధపడుతున్నారా..!



పంటి నొప్పితో ఆగకుండా బాధపడేవారు చాలా మందే ఉంటారు.. పంటి నొప్పి వచ్చినప్పుడు పెయిన్ రిలీవర్ మాత్రలు వేసుకుంటారు. అయితే దీనివల్ల మరింత ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. పంటి నొప్పి మొదలైతే తలనొప్పి కూడా వస్తుంది. అది అనుభవించిన వారికే తెలుసు. పంటి నొప్పి మొదలైతే చేసే పనిపై ఏకాగ్రత ఉండదు.. అయితే ఈ పంటినొప్పిని హోం రెమెడీస్‌తో సులభంగా నయం చేసుకోవచ్చు. వంటగదిలో లభించే పదార్థాలను ఉపయోగించే మందులు తయారు చేయవచ్చు. లవంగాలు: మన వంటగదిలోని పదార్థాలు మన వ్యాధులన్నిటినీ నయం చేస్తాయని అంటారు. అదేవిధంగా మనం వంటల్లో ఉపయోగించే మసాలా దినుసులలో ఒకటైన లవంగాలు పంటి నొప్పిని దూరం చేస్తాయి. పంటి నొప్పి సమస్యకు లవంగం నూనె చాలా మంచిది. లవంగం నూనె పంటి నొప్పిని తగ్గిస్తుంది. ఎందుకంటే లవంగం నూనెలో యూజినాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది పంటి నొప్పి, ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియా పెరుగుదలను నివారిస్తుంది. అంతేకాకుండా, లవంగం నూనెలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ మరియు యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి.


# ఉదయాన్నే కొత్తిమీర నీటిని తాగితే...!



కొత్తిమీర ప్రతీ ఇంటి వంటగదిలో ఖచ్చితంగా ఉండే పరికరం. ఇది లేకుండా మహిళలు వంట చేయరు అనడంలో అతిశయోక్తి లేదు. బగార, బిర్యాని, నాన్ వెజ్ వంటకాల్లో ప్రతీరోజు కూరలో కొత్తిమీరను వేయకుండా వంట చేయరు. అయితే కొత్తిమీరను ప్రతి ఆహారంలో యాడ్ చేస్తుంటారు. కొందరు మాత్రం గార్నిషింగ్ కోసం వాడుతుంటారు దీంతో రుచికరంగా మారుతాయని భావిస్తారు. అయితే కొత్తిమీర వంటకు రుచిని ఇవ్వడంతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. కొత్తిమీరలో పొటాషియం, కాల్షియం, విటమిన్ సి, మెగ్నీషియం, వంటివి ఉంటాయి కాబట్టి అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడుతాయి. ముఖ్యంగా ఉదయం పరిగడుపున కొత్తి మీర నీరు తాగడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు అని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం. కొత్తిమీర ఆకుల్లో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. కాబట్టి వీటిని నైట్ నీటిలో వేసి ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగితే జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా మలబద్దకం సమస్య నుంచి బయటపడవచ్చు. ఇటీవల కాలంలో చాలా మంది అధిక బరువు కారణంగా బాధపడుతున్నారు. దీంతో అన్ని చిట్కాలను పాటిస్తూ నానా తంటాలు పడుతున్నప్పటికీ బరువు తగ్గ లేకపోతున్నారు. అలాంటి వారు కొత్తిమీర ఆకులను మరిగించి నీటిని వడకట్టి తాగడం వల్ల నాజుకుగా తయారవుతారు. అలాగే చర్మం మొటిమలు మచ్చలను తగ్గించి అందంగా కనిపించేలా సహాయపడుతుంది.

# బెల్లాన్ని ఎక్కువగా తింటున్నారా....?

ఇటీవల కాలంలో ఆరోగ్యంపై శ్రద్ధతో చాలా మంది షుగర్ వాడకం చాలా వరకు తగ్గించేశారు. షుగర్‌కి బదులు బెల్లాన్ని వాడుతున్నారు. ఆరోగ్యపరంగా బెల్లం అపారమైన ప్రయోజనాలను చేకూరుస్తుంది. రక్తాన్ని శుద్ధి చేయడంలో, మెటబాలిజం రేటును పెంచడంలో, జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో, రక్తహీనతను తరిమి కొట్టడంలో, శరీరానికి శక్తిని అందించడంలో, రోగనిరోధక వ్యవస్థను బలపరచడంలో బెల్లం చాలా అద్భుతంగా సహాయపడుతుంది. అయితే ఆరోగ్యానికి మంచిది అన్నారు కదా అని కొందరు బెల్లాన్ని అధికంగా వాడుతుంటారు. ఈ అలవాటు మీకు కూడా ఉంటే వెంటనే వదులుకోండి. ఎందుకంటే అతిగా అమృతం తాగిన విషమే అవుతుంది కాబట్టి. అధికంగా బెల్లాన్ని తీసుకోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. శుద్ధి చేసిన తెల్ల చక్కెర కంటే బెల్లం మనకు చాలా మంచిది. కానీ అధికంగా బెల్లం తింటే కేలరీలు పెరుగుదలకు దారితీస్తుంది. ఫలితంగా అధిక బరువు బారిన పడతారు. అలాగే బెల్లం వేడిని కలుగజేస్తుంది. అధిక మొత్తంలో బెల్లం తీసుకున్నప్పుడు కొందరికి ముక్కులో మంచి రక్తస్రావం(బ్లీడింగ్ ) అవుతుంటుంది. బెల్లంలో అనేక పోషకాలతో పాటు సుక్రోజ్ కూడా ఉంటుంది. కాబట్టి ఎటువంటి లిమిట్ లేకుండా బెల్లం తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపు తప్పుతాయి. మధుమేహం బాధితులకు ఇది



చాలా ప్రమాదకరం. వాస్తవానికి బెల్లంలో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. జీర్ణక్రియకు ఫైబర్ ఎంతో అవసరం అయితే అదే ఫైబర్ ఎక్కువ మొత్తంలో శరీరంలోకి చేరితే మలబద్ధకం, అతిసారం, కడుపు నొప్పి సమస్యలు కలుగుతాయి. లిఅంతేకాదు బెల్లాన్ని ఓవర్ గా తీసుకోవడం వల్ల అలసట, తలనొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు వంటి సమస్యలు కూడా ఇబ్బంది పెట్టే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి బెల్లాన్ని కూడా మితంగా వాడాలి. అదే విధంగా బెల్లాన్ని అధికంగా తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. కానీ అధికంగా బెల్లం తింటే కేలరీలు పెరుగుదలకు దారితీస్తుంది. ఫలితంగా అధిక బరువు బారిన పడతారు. అలాగే బెల్లం వేడిని కలుగజేస్తుంది. అధిక మొత్తంలో బెల్లం తీసుకున్నప్పుడు కొందరికి ముక్కులో మంచి రక్తస్రావం(బ్లీడింగ్ ) అవుతుంటుంది.

# 'థీమ్ ఆఫ్ కల్కి' సాంగ్ రిలీజ్




నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న మైథాలజికల్ సైన్స్ ఫిక్షన్ మూవీ కల్కి 2898 ఏ.డి. ఈ సినిమాలో యూనివర్సల్ స్టార్ హీరో కమల్ హాసన్, బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ లు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా, ఈ నెల 27న ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా రిలీజ్ కానుండగా... మేకర్స్ వరుసగా టీజర్, ట్రైలర్, సాంగ్స్‌తో సినిమాపై హైప్ పెంచేస్తున్నారు. ఈ సందర్భంగా తాజాగా కల్కి థీమ్ సాంగ్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ పాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై అశ్విని దత్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్లు, టీజర్, ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేశాయి. ఇప్పటికే అన్ని చోట్లా భారీ ఎత్తున బుకింగ్స్ జరుగుతున్నాయి.




# మాలీవుడ్ వైపు సమంత అడుగులు



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత సోషల్ మీడియాలో షేర్ చేసే ఫోటోలు, హెల్త్ అప్‌డేట్స్ నెట్టింట్లో హాట్ టాపిక్ అవుతున్నాయి. ముఖ్యంగా, సమంత తన కొత్త ప్రొడక్షన్ హౌస్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పై 'మా ఇంటి బంగారం' అనే సినిమా అనౌన్స్ చేసింది. అయితే, ఈ ప్రాజెక్ట్ ఇప్పటివరకు షూటింగ్ స్టార్ట్ కాలేదని టాక్. త్వరలోనే ఒక అప్డేట్ వచ్చే అవకాశం ఉంది. ఇక ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసే గ్లామరస్ ఫొటోలు సోషల్ మీడియాలో హీటెక్కించే విధంగా ఉంటున్నాయి. రీసెంట్ గా అమ్మడు పోస్ట్ చేసిన ఫొటోలలో ఒకటి మరింత ట్రెండ్ అవుతోంది. అద్దం ముందు నిలుచొని ఫొటో దిగిన సామ్ చిన్న నిక్కరులో అందంగా కనిపించింది. అలాగే కాస్త సన్నబడినట్లు తెలుస్తోంది. ఆమె ఫిట్నెస్ లెవెల్ ఏ స్థాయిలో ఉందో ఈ ఫొటో చెబుతోంది. ఇక తొలిసారిగా సమంత వెబ్ సిరీస్ "సిటాడెల్: హనీ బన్నీ" లో నటించింది. ఈ వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో త్వరలోనే స్ట్రీమింగ్ కానుంది. ఈ ప్రాజెక్ట్ తర్వాత సమంత మరో ప్రాజెక్ట్‌కి సంబంధించి ఒక ముఖ్యమైన ప్రకటన చేసే అవకాశముందని ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు, సమంత మలయాళ సినీ పరిశ్రమలోకి అడుగు పెట్టడానికి సిద్ధంగా ఉందని వార్తలు వస్తున్నాయి.

# వరుణ్ తేజ్ 'మట్కా' మేకింగ్ వీడియో..




కరుణకుమార్ దర్శకత్వంలో మెగా హీరో వరుణ్ తేజ్, మీనాక్షి చౌదరి జంటగా తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'మట్కా'. వైరా ఎంటర్టైన్మెంట్స్, SRT ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణంలో పాన్ ఇండియన్ ప్రాజెక్ట్ గా ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ సినిమాలో నోరా ఫతేహి, నవీన్ చంద్ర ముఖ్య పాత్రలు చేస్తున్నారు. అయితే తాజాగా కొన్నాళ్ల గ్యాప్ ఇచ్చిన మట్కా సినిమా షూటింగ్ మళ్లీ మొదలైంది. తాజాగా మట్కా సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియో విడుదల చేశారు మేకర్స్. ఈ వీడియోలో మట్కా కోసం వేస్తున్న సెట్స్, పీరియాడిక్ తగ్గట్టు షూటింగ్ సెటప్, వరుణ్ తేజ్ కోసం బోలెడన్ని కళ్లజోడులు, వాచ్ లు, చైన్లు, డ్రెస్ లు ఉండటం చూపించారు. రామోజీ ఫిలిం సిటీలో పీరియాడిక్ వైజాగ్ సెట్స్ వేసి ఈ సినిమా షూట్ చేస్తున్నారు.

# కొత్త ఆర్డర్లపై ఎన్‌సీసీ భారీ అంచనాలు.....!




మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణంలో నిమగ్నమైన ఎన్‌సీసీ లిమిటెడ్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.20,000 - 22,000 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు లభిస్తాయని అంచనా వేస్తోంది. సంస్థ వార్షిక ఫలితాలపై ఇన్వెస్టర్లతో నిర్వహించిన 'కాన్ఫరెన్స్ కాల్' లో ఎన్‌సీసీ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఆర్.ఎస్.రాజు ఈ విషయాన్ని వెల్లడించారు. ఎన్‌సీసీ వద్ద గత ఆర్థిక సంవత్సరం చివరికి రూ.57,536 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. దీనికి ఈ ఆర్థిక సంవత్సరంలో లభించే కొత్త ఆర్డర్లు అదనం. అందువల్ల ఆదాయాలు 15% పెరుగుతాయని ఈ సంస్థ అంచనా వేస్తోంది. నిర్మాణ కాంట్రాక్టులే కాకుండా, ఇంధన సేవల విభాగంలోకీ ఎన్‌సీసీ అడుగుపెట్టిన విషయం విదితమే. ఇటీవల రూ.7,403 కోట్ల విలువైన మూడు స్మార్ట్ ఎనర్జీ మీటర్ల ప్రాజెక్టులను సంస్థ దక్కించుకుంది. ఇందులో ఒకటైన బిహార్ మీటర్ ప్రాజెక్టును ఎన్‌సీసీ సొంతంగా చేపడుతుంది. మిగిలిన రెండు ప్రాజెక్టుల కోసం (రూ.5,756 కోట్ల విలువ) రెండు ప్రత్యేక కంపెనీలు (ఎస్‌పీవీ) ఏర్పాటు చేసింది. ఈ రెండు కంపెనీలు ప్రస్తుతం నిధుల సమీకరణ యత్నాలు చేపట్టాయి. నిధులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపు స్మార్ట్ మీటర్ ప్రాజెక్టులు పూర్తి చేసే పనిలో ఉన్నాయి. ఎబిటా అంచనా 10 శాతం: గత ఆర్థిక సంవత్సరంలో ఎన్‌సీసీ ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.20,971 కోట్ల ఆదాయాన్ని, రూ.711 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2022-23తో పోల్చితే ఆదాయం 34%, నికరలాభం 17% పెరిగాయి. చేతిలో ఉన్న ఆర్డర్లు, కొత్త ఆర్డర్లు లభించే అవకాశాలు పరిగణనలోకి తీసుకుని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆదాయాల్లో 15% వృద్ధి సాధించగలమని భావిస్తున్నట్లు ఆర్.ఎస్.రాజు వివరించారు. ఎబిటా (వడ్డీ, పన్ను, తరుగుదల, ఇతర కేటాయింపుల కంటే ముందు ఆదాయం) 9.5- 10 శాతంగా ఉంటుందని పేర్కొన్నారు. కంపెనీకి రుణభారం గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంతో పోల్చితే నాలుగో త్రైమాసికంలో రూ.400 కోట్లకు పైగా తగ్గింది. దీనివల్ల రుణభారం ప్రస్తుతం రూ.1,005 కోట్లు మాత్రమే ఉంది. ఈ ఆర్థిక సంవత్సరాంతానికి దీన్ని ఇంకా తగ్గించుకుని, రూ.500 కోట్లకు పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజు తెలిపారు. 'ట్రేడ్ రిసీవబుల్స్' గత ఆర్థిక సంవత్సరంలో రూ.150 కోట్లు తగ్గి రూ.2,791 కోట్లకు పరిమితం అయినట్లు చెప్పారు. గ్రూపు కంపెనీల్లో పచ్వారా కోల్ మైనింగ్, ఎన్‌సీసీ అర్బన్ గత ఆర్థిక సంవత్సరంలో అధిక ఆదాయాలు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## సెన్సెక్స్‌కు 200 పాయింట్ల లాభం...



**ముంబయి :** ఆసియా మార్కెట్లలోని సానుకూల సంకేతాల మధ్య దేశీయ సూచీలు మంగళవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:23 గంటల సమయంలో సెన్సెక్స్ 204 పాయింట్ల లాభంతో 77,545 వద్ద ట్రేడవుతోంది.నిఫ్టీ 56 పాయింట్లు పెరిగి 23,594 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.49 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, ఎల్ అండ్ టీ, సన్‌ఫార్మా, టాటా మోటార్స్, రిలయన్స్, మారుతీ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోటక్ మహీంద్రా బ్యాంక్, అదానీ పోర్ట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నెస్లే ఇండియా, టైటన్, ఎన్‌టీపీసీ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా మార్కెట్లు సోమవారం మిశ్రమంగా ముగిశాయి. టెక్ స్టాక్స్‌లో వచ్చిన అమ్మకాలతో నాస్‌డాక్, ఎస్ అండ్ పీ 500 సూచీలు నష్టపోయాయి. మిగతా రంగాల్లో వచ్చిన ర్యాలీతో డోజోన్స్ భారీగా లాభపడింది. నేడు ఆసియా-పసిఫిక్ సూచీలు సానుకూలంగా ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 85.98 డాలర్ల వద్ద కొనసాగుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు సోమవారం నికరంగా రూ.654 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు సైతం రూ.820 కోట్ల వాటాలను అమ్మేశారు.

## భారీగా తగ్గుతోన్న బంగారం ధరలు....!



బంగారం ప్రియులకు గోల్డెన్ న్యూస్ ఇది.. గత కొద్దిరోజులుగా బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. రూ. 75 వేల మార్క్ అందుకున్న బంగారం ధర.. భారీగా తగ్గి రూ. 73 వేల మార్క్ దగ్గర కొనసాగుతోంది.మూడు రోజుల వ్యవధిలో సుమారు రూ. వెయ్యికి పైగా తగ్గింది. ఈ తరుణంలో దేశంలోని పలు ప్రధాన నగరాల్లో మంగళవారం బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 66,240గా ఉండగా, 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 72,220 వద్ద కొనసాగుతోంది. మరి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో వెండి, బంగారం ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందామా.. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 66,390 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,370 వద్ద కొనసాగుతోంది. అటు ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,240 వద్ద కొనసాగుతుండగా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,220గా ఉంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 66,240గా ఉండగా.. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 72,220గా ఉంది. ఇక ఏపీలోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నంలోనూ ఇదే ధర కొనసాగుతోంది. వెండి కూడా బంగారం బాటలోనే పయనిస్తోంది. గత మూడు రోజులుగా వెండి రూ. 2400 మేరకు తగ్గింది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, పూణే నగరాల్లో కిలో వెండి రూ. 91,600 ఉండగా.. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో కిలో వెండి రూ. 96,100 వద్ద కొనసాగుతోంది.

## జీఎస్టీ అమలు తర్వాత ఏ వస్తువులు చౌకగా మారాయి?




వస్తు సేవల పన్ను(జీఎస్టీ) 17 స్థానిక పన్నులు, 13 రకాల సెస్‌లను కేవలం ఐదు భాగాలుగా విభజించడం ద్వారా మొత్తం పన్ను వ్యవస్థను చాలా సులభతరం చేసింది. జూలై 1, 2017 నుంచి జీఎస్టీ అమలు చేయబడింది. గత 6 సంవత్సరాలలో సామాన్య ప్రజలు ఉపయోగించే కొన్ని ఉత్పత్తులు, సేవలపై పన్నులు తగ్గించబడ్డాయి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (%జదీ×జ%) డేటా ప్రకారం జీఎస్టీ అమలులోకి వచ్చిన వెంటనే పిండి, సౌందర్య సాధనాలు, టెలివిజన్, రిఫ్రిజిరేటర్లు వంటి వస్తువులు చౌకగా మారాయి.దీనివల్ల కుటుంబాల ఆదాయంపై ఒత్తిడి తగ్గి, మోసే సామర్థ్యం పెరిగింది. శనివారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, 'జీఎస్టీ చెల్లింపుదారుల జీవితాన్ని సులభతరం చేయడమే మా ఉద్దేశమని పన్ను చెల్లింపుదారులకు నేను భరోసా ఇవ్వాలనుకుంటున్నాను. మేము కనీస సమ్మతి కోసం పని చేస్తున్నాము." అని మంత్రి వెల్లడించారు. జీఎస్టీ సామాన్యులపై భారం మోపుతుందన్న ఆరోపణలను కూడా గతంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. జీఎస్టీ కింద సామాన్యులు, పేదల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని ఆమె పేర్కొన్నారు. 2017 నుంచి పన్ను రేట్లు నిరంతరం తగ్గించబడ్డాయన్నారు. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత గతంలో కంటే అనేక నిత్యావసర వస్తువులపై పన్ను తగ్గించామన్నారు. నూనె, సబ్బుపై పన్ను 28 శాతం నుండి 18%కి తగ్గించబడిందన్నారు. జీఎస్టీ కింద ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై గతంలో అధికంగా 31.3 శాతం పన్ను విధించగా ఇప్పుడు 18 శాతం మాత్రమే విధిస్తున్నారని చెప్పారు. బ్రాండ్ లేని ఆహార పదార్థాలు, ప్రాణాలను రక్షించే మందులు, ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయ సేవలు వంటి అనేక వస్తువులకు GST కింద మినహాయింపు ఇవ్వబడింది.

## రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎలక్ట్రిక్ వచ్చేస్తోంది..!




మన భారతదేశంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌కి కల్ట్ ఫాలోయింగ్ ఉంది. మార్కెట్లో ఎన్ని వందల రకాల మోటార్ సైకిళ్లు అందుబాటులో ఉన్నారాయల్ ఎన్‌ఫీల్డ్ కి మాత్రం క్రేజ్ ఏ మాత్రం తగ్గదు. ఏళ్లుగా దాని బ్రాండ్ ఇమేజ్ ని అలా కాపాడుకుంటూ వస్తుంది. ఈ బండి సౌండే చాలా విభిన్నం. దీనికే చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. ఆ సౌండ్ కోసమే ఈ బండి వాడేవారున్నారంటే అతిశయోక్తి కాదు. అయితే ప్రస్తుతం అంతా ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లుతున్న తరుణంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా తన మొదటి ఎలక్ట్రిక్ వేరియంట్ ను తీసుకొచ్చేందుకు గత కొంతకాలంగా ప్రయత్నిస్తోంది. ఇప్పటికే దీని ప్రోటో టైప్ ను కూడా ప్రదర్శించింది. పలు దఫాలుగా పరీక్షలు సైతం నిర్వహించింది. ఇప్పుడు దీనిని మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు సమాయత్తమవుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.. రాయల్ ఎన్‌ఫీల్డ్ భారతీయ మార్కెట్ కోసం ఎలక్ట్రిక్ బైక్‌ను తయారు చేస్తోంది. ఇది ఇప్పటికే ప్రోటోటైప్ మోడల్‌ను పరీక్షిస్తోంది. ఈ సమాచారాన్ని ఐషర్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈఓ సిద్ధార్థ లాల్ తెలియజేశారు. ఆయన చెబుతున్న దాని ప్రకారం బ్రాండ్ వాణిజ్య వైపు గుర్తించడానికి ఒక బృందాన్ని కూడా ఉంచింది. బ్రాండ్ రాబోయే రెండేళ్లలో ఈ ఉత్పత్తిని ప్రారంభించాలని యోచిస్తోంది. అందుకోసమే గత ఆర్థిక సంవత్సరం అంటే 2023-2024లో రాయల్ ఎన్‌ఫీల్డ్ రూ. 1,000 కోట్ల క్యాపెక్స్‌ని క్రమబద్ధీకరించింది. ఈ పెట్టుబడిలో ఎక్కువ భాగం ఎలక్ట్రిక్ ఉత్పత్తులపైనే పెట్టింది. ఎలక్ట్రిక్ వెహికల్ స్పేస్ కోసం కంపెనీ ఇప్పటికే 100 మందిని నియమించుకుంది. ఇది ఈవీల కోసం కొత్త ఉత్పత్తి లైన్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియ. ప్రారంభంలో, ఈ ఉత్పత్తి లైన్ సంవత్సరంలో 1.5 లక్షల యూనిట్లను ఉత్పత్తి చేయగలదు. రానున్న కొద్ది నెలల్లోనే రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎలక్ట్రిక్ వేరియంట్ లాంచ్ అయ్యే అవకాశం ఉంటుంది.

## ఐటీ నిపుణులకు గుడ్ న్యూస్....




బ్యాంకింగ్ వ్యవస్థ మన దేశంలో కొత్త పుంతలు తొక్కుతోంది. అన్ని బ్యాంకులు అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాయి. ఏ బ్యాంకుకు ఆ బ్యాంకు ప్రత్యేకమైన యాప్ లను తీసుకొస్తున్నాయి.వాటిని మెయింటేన్ చేసేందుకు స్టాఫ్ కూడా అవసరం అవుతున్నారు. ముఖ్యంగా టెక్ టీం ప్రతి బ్యాంకులకు అవసరం అవుతోంది. ఈ క్రమంలో అన్ని బ్యాంకులు తమకు ఉన్న రెగ్యూలర్ ఉద్యోగులతో పాటు టెక్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న వారిని కూడా రిక్రూట్ చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా రాబోయే రెండేళ్లలో తన అంతర్గత సాంకేతిక బృందం హెడ్‌కౌంట్‌ను 3,000కి రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆ బ్యాంకులో పనిచేసే ఒక ఉన్నత అధికారి సూచన ప్రాయంగా చెప్పారు. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టెక్నాలజీ ఆర్కిటెక్చర్‌లో లోటుపాట్ల గుర్తించి.. బ్యాంకులపై కఠినమైన చర్యలు తీసుకుంది. ఆ లోపాల వల్ల లావాదేవీల క్రమం తప్పడంతో వినియోగదారులు ఇబ్బందులు పడటంతో లావాదేవీలు ఎక్కువగా చేయగల సామర్థ్యాన్ని పెంచేలా కొన్ని ప్రత్యేకమైన చర్యలు తీసుకుంది. బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ)లో ప్రస్తుతం 1,500 మంది ఉద్యోగులున్నారని.. ఈ టీమ్ స్ట్రెంత్‌ను మరింతగా పెంచనున్నట్లు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేబదత్తా చంద్ ఇటీవల ఓ వార్తా సంస్థతో చెప్పారు. అందుకోసం రెగ్యులర్ హైరింగ్ ప్రక్రియతో స్పెషలిస్ట్ ఉద్యోగాలకు త్వరలో నియామకాలు జరుగుతాయని వివరించారు. రాబోయే రెండేళ్లలో తమ ఐటీ టీమ్‌లోని వ్యక్తుల సంఖ్యను రెట్టింపు చేస్తామని మార్చి త్రైమాసిక ఆదాయాలను ప్రకటించిన తర్వాత చంద్ చెప్పారు.

## ఇండెక్సేషన్ అంటే ఏంటి.....?




ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలుకు సమయం వచ్చేసింది. దీంతో చాలామంది పన్ను భారాన్ని ఎలా తగ్గించుకోవాలో ఆలోచిస్తుంటారు. ఈ విషయంలో ఇన్వెస్టర్లకు ఇండెక్సేషన్ చాలా ఉపయుక్తంగా ఉంటుంది. ఇంతకీ దీనర్థం ఏంటి? మదుపర్లకు ఎలాంటి ప్రయోజనం ఉంటుందో చూద్దాం..! ఇండెక్సేషన్ అనేది స్టాక్‌లు, బాండ్లు, రియల్ ఎస్టేట్ వంటి పెట్టుబడులను ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సర్దుబాటు చేసే పద్ధతి. సాధారణంగా వీటిలో పెట్టుబడి ప్రస్తుత ధరలకు అనుగుణంగా ఉంటాయి. కాలక్రమేణా ద్రవ్యోల్బణం కారణంగా మన వాస్తవ పెట్టుబడి విలువ తరిగిపోతుంది. ఈనేపథ్యంలో దాన్ని తాజా ధరలకు అనుగుణంగా సర్దుబాటు చేసేందుకు ఇండెక్సేషన్ ఉపయుక్తంగా ఉంటుంది. ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల ఆధారంగా ఇండెక్సేషన్‌ను అంచనా వేస్తారు. మూలధన లాభాలను కచ్చితంగా నిర్ణయించడంలో ఇది సహాయపడుతుంది. ద్రవ్యోల్బణాన్ని అధిగమించి వాస్తవ లాభాలపై మాత్రమే పన్నులు వర్తించేందుకు దోహదం చేస్తుంది. ఒక పెన్నును రూ.100లకు కొన్నామనుకొందాం. సంవత్సరం తర్వాత దాని ధర రూ.120కి చేరింది. అంటే అదే పెన్ను ధర ఇప్పుడు రూ.20 పెరిగింది. ఇప్పుడు దాన్ని మీరు ఓ రూ.10 లాభంతో విక్రయించారు. అంటే మీకు రూ.30 లాభం వచ్చింది. కానీ, ఇప్పుడు దాని ధర మార్కెట్‌లో రూ.120. ఈ నేపథ్యంలో కొనుగోలు ధరను తాజా ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సర్దుబాటు చేసేందుకు ఇండెక్సేషన్‌కు ప్రభుత్వం అనుమతిస్తుంది. అంటే మీరు అమ్మిన ధర నుంచి ఆ పెన్ను ప్రస్తుత ధరను తీసేయాలి. అప్పుడు మీ లాభం రూ.10. కేవలం ఈ రూ.10పై మాత్రమే ప్రభుత్వం పన్ను విధిస్తుంది. తద్వారా మీపై పన్ను భారం తగ్గుతుంది. అలాకాకుండా రూ.30లపై పన్ను విధిస్తే.. తాజా ద్రవ్యోల్బణం ప్రకారం మీకు మిగిలే మొత్తం చాలా తక్కువగా ఉంటుంది. అలాంటప్పుడు మదుపర్లు దీర్ఘకాల పెట్టుబడులకు వెనకాడతారు. రుసుములతో కలిపి ఏదైనా ఆస్తి కొనుగోలు ధర/పెట్టుబడిని నిర్ధరించాలి. అనంతరం 'కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ 'ను కనుక్కోవాలి. ఈనేపథ్యంలో దాన్ని తాజా ధరలకు అనుగుణంగా సర్దుబాటు చేసేందుకు ఇండెక్సేషన్ ఉపయుక్తంగా ఉంటుంది. ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల ఆధారంగా ఇండెక్సేషన్‌ను అంచనా వేస్తారు.

# సింపుల్ గవర్నమెంట్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ నా విధానం: చంద్రబాబు



**కుప్పం:** పేదరిక నిర్మూలనకు కుప్పం నియోజకవర్గం నుండే శ్రీకారం చుట్టబోతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పేదరికం లేని సమాజం కోసం వేసే తొలి అడుగు కుప్పం నుంచే మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. పేదరికం లేని గ్రామం, మండలం, నియోజకవర్గంగా ముందు కుప్పాన్ని తయారు చేస్తామన్నారు. దీని కోసం ఒక ప్రణాళికతో అధికారులు పనిచేయాలన్నారు. సింపుల్ గవర్నమెంట్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ తన విధామని అధికారులకు తెలియజేశారు. గత అడ్మినిస్ట్రేషన్ కు ఇప్పటికీ చాలా వ్యత్యాసం ఉంబోతుందని సీఎం అన్నారు. అధికారులు ఫిజికల్ వర్చ్యువల్ పని విధానాలకు సిద్ధపడాలన్నారు. బలవంతపు జనసమీకరణతో పెద్ద పెద్దమీటింగ్ లు, భారీ కాన్వాయ్ లతో సైరన్ల మోతతో హంగామాలు తమ ప్రభుత్వంలో ఉండవని చెప్పారు. సాయంత్రం 6 గంటల తర్వాత సమావేశాలు వద్దని మంత్రులకు కూడా ఇప్పటికే చెప్పానన్నారు. అధికారుల కూడా ఫాస్ట్ గా రియాక్ట్ అవ్వాలి, ఎఫెక్టివ్ గా కార్యక్రమాలు ఉండాలని సీఎం సూచించారు. కుప్పం అతిథి గృహంలో చిత్తూరు జిల్లా, నియోజకవర్గ అధికారులతో బుధవారం సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు.

కుప్పంలో రౌడీయిజం, హింస, గంజాయి, అక్రమాలు ఎట్టి పరిస్థితుల్లో కనిపించకూడదు: సీఎం చంద్రబాబు రానున్న రోజుల్లో అమలు చేయబోయే ప్రణాళికపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కుప్పం సమగ్ర అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. తన ప్రాధాన్యం, ఆలోచనలు, నిర్ణయాలకు అనుగుణంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. సమీక్షంలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ... కుప్పంలో రౌడీయిజం, హింస, గంజాయి, అక్రమాలు ఎట్టి పరిస్థితుల్లో కనిపించకూడదన్నారు. రాజకీయ ప్రోద్భలంతో పెట్టిన తప్పుడు రౌడీ షీట్లు ఎత్తి వేయాలన్నారు. రౌడీయిజం చేసే వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. గత 5 ఏళ్ళు అధికారులు మనసు చంపుకుని పనిచేశారు. వైసీపీ నేతల పైశాచిక ఆనందానికి కొందరు అధికారులు సహకరించారన్నారు. నా సొంత నియోజకవర్గానికి నేను రాలేని, మాట్లాడలేని పరిస్థితిని గత ఐదేళ్లలో కల్పించారు. తనపైన హత్యాయత్నం కేసు పెట్టారు. 2019 వరకు తనపై ఒక్క కేసు కూడా లేదు. కానీ గత 5 ఏళ్లలో అక్రమ కేసులు అనేకంగా పెట్టారన్నారు. ప్రభుత్వ వ్యవస్థలు నాశనం అవ్వడంపై నేను చాలా బాధపడ్డానన్నారు. కుప్పంలో మళ్లీ ప్రశాంతమైన వాతావరణం రావాలని సీఎం చంద్రబాబు అన్నారు.


**ప్రణాళికలు సిద్ధం చేయండి.. మార్పు కనిపించాలి..**

కుప్పం నియోజకవర్గంలో కొన్ని సమస్యలు సవాళ్లు విసురు తున్నాయి. తాగునీటి సమస్యను పరిష్కరించాలి. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా ఇంటింటికీ తాగునీరివ్వడంతో పాటు, హంద్రీనీవా కాల్వ పనులు పూర్తికి ప్రణాళిక సిద్ధం చేయండన్నారు. వ్యవసాయంలో మెరుగైన విధానాలు తీసుకురావాలి. డైరీ, మిల్క్, సిల్క్, హనీ ఉత్పత్తులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కుప్పానికి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తెస్తాం. ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల ద్వారా కుప్పాన్ని ఎడ్యుకేషన్ హబ్ చేస్తామన్నారు. యువతలో నైపుణ్యాన్ని లెక్కించేందుకు, అవకాశాలు కల్పించేందుకు, వారిలో నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక ప్రాణాళిక అమలు చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. రైతులకు సబ్సిడీలు అందించడంపై దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. ప్రతి డిపార్ట్ మెంట్ నుంచి పక్కా ప్రణాళికతో రావాలని నెలల వ్యవధిలోనే కుప్పంలో మార్పు చూపించాలని అధికారులకు, సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు.

# ఆ టీచర్ పోస్టులను భర్తీ చేయండి: హరీష్ రావు



హైదరాబాద్: రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న సోకాల్డ్ ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమైన విషయమని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు మండిపడ్డారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, సిఎం రేవంత్ రెడ్డి ఇంటి ముందు మోకాళ్ళ మీద నిలబడి ఎన్నిసార్లు అభ్యర్థించినా అభ్యర్థుల మొర అలకించకపోవడం బాధకు గురి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు తన ఫేస్ బుక్ ఖాతాలో పోస్టు చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు అత్యున్నత, నాణ్యమైన రెసిడెన్షియల్ తో కూడిన విద్యను పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో బిఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో గురుకులాలు ఏర్పాటు చేసిందని, టీచర్ల కొరత లేకుండా చేసి, విద్యా ప్రమాణాలు మరింత పెంచేందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో 9210 టీచర్ పోస్టుల భర్తీకి గత బిఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నిరుద్యోగులకు నష్టం జరగకుండా ఉండాలని, ఒక్క పోస్ట్ కూడా మిగిలిపోవద్దనే లక్ష్యంతో ఉన్నత హోదా పోస్టుల నుండి ప్రారంభించి కింది స్థాయి పోస్టుల వరకు ఫలితాలు వెల్లడించి భర్తీ చేయాలని నిర్ణయించిందని హరీష్ రావు తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇందుకు భిన్నంగా వ్యవహరించడం వల్ల ఒకే అభ్యర్థికి ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు రావడం జరిగిందని, దీనివల్ల దాదాపు 2500 పైగా టీచర్ పోస్టులు మిగిలిపోయాయని, అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బ్యాక్ లాగ్ పోస్టులు ఆపవద్దన్నారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పోస్టులు భర్తీ చేసి అభ్యర్థులకు, నిరుద్యోగులకు న్యాయం చేయాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీష్ రావు తెలిపారు.



# ఆ విషయంలో జగన్‌కు సిగ్గుచేటు: కడప ఎంఎల్ఎ

అమరావతి: ప్రతిపక్ష హోదా కావాలని స్పీకర్‌కు వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి లేఖ రాయడం సిగ్గుచేటు అని కడప ఎంఎల్ఎ మాధవీరెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష హోదా కోసం జగన్ కోరడం హేయమైన చర్య అని, ప్రతిపక్ష హోదాపై కనీస అవగాహన జగన్‌కు లేదని చురకలంటించారు. మొత్తం సభ్యుల్లో పదో వంతు ఉంటేనే ప్రతిపక్ష హోదా ఇస్తారని, ప్రజలకు ముఖం చూపించుకోలేక జగన్ కుయుక్తులకు తెరలేపారని, స్పీకర్ ఎన్నిక రోజు కూడా వైసిపి ఎంఎల్ఎలు అసెంబ్లీలోకి రాలేదని ధ్వజమెత్తారు. జగన్‌కు 11 సీట్లు ఇచ్చి ప్రజలు మంచిగా బుద్ధి చెప్పారని, వైసిపి పాలనలో ప్రతి ఒక్కరూ నష్టపోయారని విమర్శలు గుప్పించారు.

## సిగ్గులేదా... ఇంటింటికి వెళ్లి కండువాలు కప్పడానికి...

# రేవంత్ పై జగదీశ్ రెడ్డి గరం గరం



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీ బీఫాంపై గెలిచిన ఎమ్మెల్యేలు పోచారం, శ్రీనివాస రెడ్డి, సంజయ్‌కుమార్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరడం చట్ట వ్యతిరేకమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ఇద్దరి సభ్యతం రద్దు కావాల్సి ఉందన్నారు. నిన్నటి నుంచి స్పీకర్ అపాయింట్ మెంట్ కోసం ఎదురుచూస్తున్నామని, తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, తమకున్న ఇతర మార్గాల ద్వారా ఒకటి స్పీడ్ పోస్టు, ఇంకోటి ఈ మెయిల్ ద్వారా ఇద్దరిపై అనర్హత వేటు వేయాలని ఫిర్యాదు చేశామన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని, లేదంటే న్యాయపరంగా ముందుకు వెళ్తామన్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ.. కానీ ఇవాళ్నేమో సిగ్గు లేకుండా సీఎం రేవంత్ రెడ్డి ఇంటింటికి వెళ్లి కండువాలు కప్పుతున్నారని జగదేశ్ రెడ్డి దుయ్యబట్టారు.. పాంచ్ న్యాయ్‌లో భాగంగా పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని మేనిఫెస్టోలో పెట్టిన పార్టీయే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి సిగ్గుమాలిన పనులు చేయొద్దని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డే చెప్తున్నారని ఆయన వెల్లడించారు. తమ హయంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే కేసీఆర్ దగ్గరకు వచ్చి కండువాలు కప్పుకున్నారన్నారు. చట్టం ప్రకారం 23 వంతు మా పార్టీలో జాయిన్ అయ్యారని పేర్కొన్నారు.

## తెలంగాణకు భారీ వర్ష సూచన..

# ఎల్లో అలర్ట్ జారీ

**హైదరాబాద్ :** తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లల్లో రానున్న ఐదుల రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని తెలిపింది. ఈరోజు సాయంత్రం, రేపు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. హైదరాబాద్ ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక రాష్టంలోని మిగతా అన్ని జిల్లాలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది.



## బోనాలు ఘనంగా చెద్దాం..

# మంత్రి కొండా సురేఖ సమీక్ష




హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో బోనాల పండుగ సందడి ప్రారంభం కానుంది. జూలై 7 నుంచి ఆషాడ బోనాలు ప్రారంభం కానుండగా.. ఈ మేరకు పలు ఆలయాల్లో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఈసారి బోనాల పండుగ ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. కాగా, ఆషాఢ మాస బోనాల ఏర్పాట్లను దేవాదాయ ధర్మాదాయశాఖ శాఖ మంత్రి కొండా సురేఖ సమీక్షించారు. హైదరాబాద్ బేగంపేటలోని హరిత ప్లాజాలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొండా సురేఖ మాట్లాడుతూ%ా%. జులై 7 నుంచి 29వ తేదీ వరకు బోనాల పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. బోనాల పండుగ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది కూడా లేజర్ షోలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంత్ రావు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది, తదితరులు హాజరయ్యారు.

**బోనాల షెడ్యూల్ ఇదే...**

ఆషాఢంలో వచ్చే మొదటి ఆదివారం (జూలై 7)వ తేదీన హైదరాబాద్ నగరంలో బోనాల పండగ ప్రారంభమవుతుంది. మొదటగా గోల్కొండ శ్రీ ఎల్లమ్మ ఆలయంలో తొలిపూజ నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఆ తర్వాత సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, లాల్ దర్వాజ మహంకాళి ఆలయంలో నెలరోజుల పాటూ ప్రతి గురువారం, ఆదివారం ప్రత్యేక పూజలు జరుగుతాయి. తిరిగి గోల్కొండ కోటలోనే చివరి రోజు పూజ నిర్వహిస్తారు. ఈ క్రతువుతో భాగ్యనగర బోనాల ఉత్సవాలు ముగుస్తాయి.

# కాంగ్రెస్ అధిష్టానానిదే తుది నిర్ణయం...

## 3 డిప్యూటీ సిఎంల డిమాండుపై సిద్ధరామయ్య



బెంగళూరు: మరో ముగ్గురు ఉప ముఖ్యమంత్రులను నియమించాలన్న డిమాండు కర్నాటకలో మరోసారి తెరపైకి రావడంతో దీనిపై కాంగ్రెస్ అధిషానానిదే తుది నిర్ణయమని ముఖ్యమంత్రి సిద్దరామయ్య బుధవారం స్పష్టం చేశారు. వీరశైవ-లింగాయత్, ఎస్‌సి/ఎస్‌టి, మైనారిటీ వర్గాలకు చెందిన కాంగ్రెస్ నాయకుల నుంచి ముగ్గురికి ఉప ముఖ్యమంత్రి పదవులు ఇవ్వాలంటూ కొందరు మంత్రులు డిమాండు చేస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి స్పందించారు. ప్రస్తుతం వొక్కలిగ కులానికి చెందిన డికె శివకుమార్ ఒక్కరే సిద్దరామయ్య క్యాబినెట్‌లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. కాంగ్రెస్ అధిష్టానమే తుది నిర్ణయం తీసుకుంటుందని బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సిద్దరామయ్య తెలిపారు. కాగా..ఇదే విషయమై మంగళవారం ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ కూడా విలేకరుల వద్ద స్పందిస్తూ కాంగ్రెస్ అధిష్టానమే దీనిపై నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఈ డిమాండుపై ఆయన తీవ్రంగా అసంతృప్తి చెందుతున్నట్లు తెఉస్లోంది.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com